# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 7-9-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 29 | పేజీలు 8 | వెల: రూ.1/-


## చంద్రయాన్2 ఫోటోలు ట్వీట్ చేయండి : ప్రధాని మోదీ

హైదరాబాద్, సెప్టెంబర్ 6: ఇవాళ అర్ధరాత్రి చంద్రయాన్2కు చెందిన విక్రమ్ ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై దిగనున్నది. ఆ అద్భుత ఘట్టాన్ని ప్రధాని మోదీ వీక్షించనున్నారు. బెంగుళూరులోని ఇస్రో కేంద్రం నుంచి విక్రమ్ ల్యాండింగ్‌ను వీక్షించనున్నట్లు ఆయన ఇవాళ ట్వీట్ చేశారు. 130 కోట్ల మంది ఈ సమయం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్2 దిగుతుందన్నారు. ప్రపంచ దేశాలు ఇస్రో శాస్త్రవేత్తల సత్తాను చూస్తారన్నారు. తనతో పాటు కొందరు యువకులు కూడా ఈ ఈవెంట్‌ను వీక్షించనున్నట్లు ఆయన చెప్పారు. విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై దిగే అనిర్వచనీయ క్షణాలను అందరూ వీక్షించాలని, ఆ అద్భుత ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. కొన్ని ఫోటోలను తానూ రీట్వీట్ చేయనున్నట్లు చెప్పారు.

# జింబాబ్వే మాజీ అధ్యక్షుడు కన్నుమూత

**- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ముగాబే**



హరారే, సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ) : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జింబాబ్వే మాజీ అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే(95) కన్నుమూశారు. ఏప్రిల్ నుంచి ముగాబే.. అనారోగ్యంతో సింగపూర్‌లోని ఓ హాస్పిటల్ లో ట్రీట్మెంట్ పొందుతున్నారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం ఆయన మరణించారు. 1980లో జింబాబ్వేలో బ్రిటీష్ వలసవాదం ముగిసినప్పటి నుంచి ముగాబే 37 ఏళ్ళు అధికారంలో కొనసాగారు. 2017లో ఆర్మీ తిరుగుబాటు చేసి అధికార పగ్గాలను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఆర్మీ.. దేశాన్ని తమ గుప్పిట్లోకి తీసుకోవడంతోపాటు ముగాబెను హౌజ్ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ముగాబేకు వ్యతిరేకంగా రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా ప్రజలు సామూహిక నిరసన ప్రదర్శనలు చేశారు. 93 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ వయసున్న దేశాధ్యక్షుడిగా ముగాబె రికార్డు సృష్టించారు. తనకు పోటీగా వస్తున్నాడంటూ చాలాకాలంగా తన డిప్యూటీగా ఉన్న ఎమర్సన్ ఎంనంగాగ్వాను కేబినెట్ నుంచి తప్పించి తన భార్య గ్రేస్ ముగాబెను తర్వాతి అధ్యక్షురాలిగా చేయాలని ముగాబె భావించడం ఆయన పతనానికి కారణమైంది. అనంతర పరిస్థితుల్లో ముగాబేకు తాను రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు దశాబ్దాలు దేశాన్ని పాలించిన రాబర్ట్ ముగాబే రాజీనామా చేయడంతో ఎమర్సన్ మ్నంగగ్వా దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఎమర్సన్ గతంలో ఉపాధ్యక్షుడిగా చేశారు. రెండు వారాల క్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో అధ్యక్షుడు ఎమర్సన్ మాట్లాడుతూ.. డాక్టర్లు ముగాబేకి ట్రీట్మెంట్ ను నిలిపివేశారన్నారు. శుక్రవారం ఆయన ట్వీట్‌లో ముగాబే మరణవార్తను ధృవీకరించారు. జింబాబ్వే వ్యవస్థాపక తండ్రి, మాజీ అధ్యక్షుడు మరణవార్తను ప్రకటించడం చాలా బాధగా ఉందని ఎమర్సన్ తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# వాతావరణంలో మార్పుల కారణంగానే వ్యాధులు

**- మెరుగైన సేవలు అందిస్తున్నాం**
**- అన్నిచోట్లా మందులు అందుబాటులో ఉన్నాయి**
**- ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేందర్**
**- పబ్లిసిటీ కోసం గాలిమాటలొద్దు**
**- హెల్త్ ఎమర్జెన్సీ వచ్చినట్లు ఎందుకంత రాద్ధాంతం**
**- ప్రతిపక్షాల తీరుపై మండిపడ్డ మంత్రి తలసాని**
**- గాంధీ ఆస్పత్రిని సందర్శించిన మంత్రులు**

హైదరాబాద్, సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ) : వాతావరణంలో మార్పుల కారణంగానే సీజన్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వ్యాధుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేంద్ర అన్నారు.

శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఈటెల రాజేందర్‌లు గాంధీ ఆస్పత్రిని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల గాంధీ ఆస్పత్రిలో తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఇప్పటి వరకు ఏం చర్యలు తీసుకున్నారని ఆస్పత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ... వాతావరణంలో మార్పుల కారణంగానే వ్యాధులు వస్తున్నాయని, రోగులకు సరైన సేవలు అందించేందుకు వైద్యులు, ప్రభుత్వం పూర్తిగా కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అన్ని చోట్లా మందులు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను చూస్తే తెలంగాణలో మెరుగైన వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అన్ని చోట్లా మందులు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. గాంధీ ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన సెమినార్ హాలు, లైబ్రరీని మంత్రులు ప్రారంభించారు.

### పబ్లిసిటీకోసం గాలిమాటలొద్దు - మంత్రి తలసాని

వాస్తవాలు విస్మరించి.. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ వచ్చినట్లుగా ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. ప్రతిపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. నగరంలో వైద్యులంతా అప్రమత్తంగా ఉన్నారని, ఆదివారం కూడా వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు.

వాతావరణం మార్పుతో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తున్నాయని తెలిపారు. విషజర్వాలను అదుపు చేయడానికి వైద్యులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. దేశంలోనే బెస్ట్ మెడికల్ సేవలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు అనవసర రాద్దాంతం చేయొద్దని హితవు పలికారు. డెంగీ లేదనడం లేదని.. డెంగీని అదుపులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పబ్లిసిటీ కోసం గాలి మాటలు మాట్లాడవద్దని ప్రతిపక్షాలను దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయి వైద్యం అందిస్తున్నామన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నాయన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తలసాని స్పష్టం చేశారు.



# కేరళ గవర్నర్‌గా అరిఫ్ ప్రమాణం

**- ప్రమాణం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి**
**- పాల్గొన్న కేరళ సీఎం, మంత్రులు**



కేరళ గవర్నర్‌గా ప్రమాణం చేసిన మహ్మద్ అరీఫ్ ఖాన్. చిత్రంలో సిఎం పినరయ్ కూడా ఉన్నారు.

తిరువనంతపురం, సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ) : కేరళ కొత్త గవర్నర్‌గా అరిఫ్ మహ్మద్ ఖాన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం గవర్నర్‌గా అరిఫ్ బాధ్యతలు స్వీకరించారు. అరిఫ్ చేత ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి కేరళ సీఎం పినరయి విజయన్, మంత్రులు, రాజ్‌భవన్ సిబ్బందితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సదాశివం స్థానంలో ఖాన్ బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ సదాశివం పదవీకాలం పూర్తవడంతో.. ఆయన స్థానంలో ఖాన్‌ను కేంద్రం నియమించింది. రిఫ్ మహమ్మద్ ఖాన్‌ది అరుదైన వ్యక్తిత్వం. ముక్కుసూటిగా వ్యవహరించే ఆయన, ముస్లిం చట్టాల్లో మార్పులు అవసరమని గట్టిగా చెప్పేవారు. ట్రిపుల్ తలాక్ రద్దు చట్టంపై ప్రధాని మోదీకి మద్దతిచ్చి వార్తల్లో నిలిచారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఖాన్, లౌకిక పార్టీలతో ముస్లింలకే నష్టమని బలంగా నమ్మే వ్యక్తి. విద్యార్థి నేతగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన, 26వ ఏట యూపీ శాసనసభకు ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 1980, 84లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును నాటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ కేంద్ర క్యాబినెట్ నుంచి వైదొలిగిన ఖాన్.. కాంగ్రెస్‌ను వీడిన తర్వాత జనతాదళ్, బీఎస్పీలో చేరారు. 2004లో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే 2007వరకు క్రియారహితంగానే ఉన్నారు. పార్టీలో గుర్తింపు లభించక పోవడంపై పలు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేసిన ఆరిఫ్‌కు అనూహ్యంగా గవర్నర్ పదవి వరించింది.

## చరిత్రలో నేటినిజం



కం॥ మేఘము వలె గర్జించుచు
మొఘుని వలె రసమును 'సినిమా' తొసగంగన్
లాఘవమున ముదము నిడగ
శ్లాఘించెద 'భానుమతి'ని -'చండి' రాణినే !!

( సెప్టెంబర్ 7 భానుమతి జననం)

-రాధశ్రీ
సెల్: 9494481210



## ఓఎంసీ కేసు విచారణ ఈ నెల 11కు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 6: ఓబులాపురం మైనింగ్ కంపెనీ కేసులో విచారణ నిమిత్తం సీబీఐ కోర్టుకు గాలి జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి, రాజగోపాల్‌లు హాజరయ్యారు. ఓఎంసీ కేసు విచారణను సీబీఐ కోర్టు ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. ఓఎంసీ కేసులో తదుపరి దర్యాప్తుపై కోర్టుకు సీబీఐ వివరణ ఇచ్చింది. అంతరాష్ట్ర వివాదం మినహా మిగితా దర్యాప్తు పూర్తయింది. దర్యాప్తు పూర్తయ్యాకే చార్జిషీట్ దాఖలు చేశాం. సరిహద్దు వివాదం జోలికి వెళ్లొద్దని గతంలో హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలున్నందున సరిహద్దుల పరిధిపై ప్రస్తుతం దర్యాప్తు చేపట్టలేం. దర్యాప్తు పెండింగ్‌లో ఉండటం అభియోగాలపై విచారణ చేపట్టేందుకు అడ్డంకి కాదు. సీఆర్‌పీసీ ప్రకారం దర్యాప్తు సంస్థలు ఎప్పుడైనా తదుపరి దర్యాప్తు చేయవచ్చు.

# సెలవులు లేకుండా వైద్యులు పనిచేస్తున్నారు...



హైదరాబాద్, సెప్టెంబర్ 6: రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి ఈటెల రాజేందర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నాలుగు రోజులుగా వరుస సమావేశాలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా విష జ్వరాల తీవ్రతను తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. డెంగీ లక్షణాలు కొంత మారాయి. గతంలో డెంగీ వస్తే చనిపోయేవారు. ఇప్పుడు తీవ్రత తగ్గింది. రోగుల సంఖ్య పెరిగినా... త్వంగానే వ్యాధి నయమవుతోంది.

ఫీవర్ ఆస్పత్రిలో 51 వేల మందికి పరీక్షలు చేస్తే 62 మందికే డెంగీ ఉన్నట్లు తేలింది. గాంధీ ఆస్పత్రిలో 419 మందికి వ్యాధి నయం చేసి పంపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ బోధన ఆస్పత్రుల్లో సాయంత్రం ఓపీ నిర్వహిస్తున్నాం. సెలవు కూడా లేకుండా వైద్యులు పనిచేస్తున్నారు. మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నాం. ప్రజల్లో జ్వరాల పట్ల భయం పెంచేలా ప్రచారం చేయొద్దు. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేయాలని నిర్ణయించాం. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రజలు, ప్రభుత్వం కలిసి పనిచేస్తే సమస్యల నుంచి బయటపడుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఒక్క సైన్‌ఫ్లూ కేసు నమోదైంది.

పాఠశాలల్లో ప్రాథమిక నివారణ చర్యలు చేపట్టాలని కోరాం. జ్వరాలపై జూన్ నుంచి ఎప్పటికప్పుడు సమాయత్తమయ్యాం. ప్రజల భాగస్వామ్యం లేకుండా భారీ సమస్యలను ప్రభుత్వమే నివారించలేదు. అవసరమైన చోటు ఔట్‌సోర్స్ వైద్యులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రతి రోజూ ప్రైవేటు ఆస్పత్రుల రోగుల నివేదికను డీఎంహెచ్‌వోకు పంపాలని ఆదేశించాం. మూసీ పరిసరాల్లో నీరు నిలువ వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయి. నీరు నిలువ ఉన్న ప్రాంతంలో దోమలు గుడ్లు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



. గవర్నర్ నరసింహన్ దంపతులను రాజ్‌భవన్‌లో కలసిన స్పీకర్ పోచారం దంపతులు

# గౌరవప్రదం.. గురుపూజోత్సవం..!!

నేటి నిజం
శనివారం 7-9-2019

అమ్మ, నాన్న తర్వాత స్థానం గురువుకే ఇచ్చారు. అంటే ఇంట అమ్మనాన్న ఆదిగురువులయితే, బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి తొలి వ్యక్తి గురువే" అని అందరికీ తెలుసును కూడా.. అమ్మ, నాన్న, తర్వాత ఇచ్చే స్థానం గురువుకే.. కన్నవారు తల్లితండ్రులైతే.. విజ్ఞానాన్ని అందించేవాడు గురువు.. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే తల్లితండ్రులు జన్మనిస్తారు.. గురువులు జీవితాన్నిస్తారు అంటారు అరిస్టాటిల్.. ఈ మాట అక్షరసత్యమే.. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని మనం నమ్మితే, అందుకు బాధ్యులు మాత్రం ఖచ్చితంగా గురువులే కదా? ఏమి సముపార్జించారనేది కాకుండా ఏమేం విడనాడారన్న దానికి ఆధారంగా కూడా వ్యక్తులు రూపొందుతారు. జాతి వ్యక్తి త్వానికి ఇది ఖచ్చితంగా వర్తిస్తుంది అని ఏనాడో తీర్మానిం చారు భారతరత్న సర్వేపల్లి రాధా కృష్ణ... వ్యక్తుల జ్ఞాన సముపార్జన ఒక్కటే కాదు చెడ్డ లక్షణాలను త్యజిం చడమూ వ్యక్తిత్వాల్ని రూపుదిద్దుకోవడం అనేది గురువుల మాట.. పలక బలపంతో ఏదో ఖైదులోకి వస్తున్నట్లు బెదురుబెదురుగా లేడిపిల్లా అందరి వంకా భయంభయంగా చూస్తూ పాఠశా లలోకి అడుగు పెట్టినా అమ్మ చేయి విడవకుండా కళ్ళనిండా నీళ్లతో వచ్చిన ఈ చిన్నారుల భవితవ్యానికి అక్షరాలతో పాటుగా వారి మనోఫలకంపై మంచి చెడుల విచక్షణను తీర్చిదిద్దే మహా శిల్పి గురువు.. అసలు 'గురు' అంటే అర్థం చీకటిని పారద్రోలి జాతినిర్మాణ మహాక్రతువులో గురుతర బాధ్యతను పోషిస్తున్న వారి సేవల్ని సంస్మరించుకోవడానికి ఈ గురుపూజోత్సవం.. అయితే కాలం మారుతోంది.. ఆధునిక పర్వంలో పద్దతులూ మారిపోతున్నాయి. అన్ని పార్శ్వాలోకి చొచ్చుకుపోతోంది.. అయినా జీవన విధానానికి పట్టుకొమ్మ లాంటి సంస్కృతి ఆయా పండగల్లోనూ, తదితర శుభకార్యాల్లోనూ ప్రతిఫలిస్తూనే వుంటుంది.. దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్, ఆగస్టు 15 లాంటి పండుగలాంటిదే ఈ గురుపూజోత్సవం. దేశానికి రాజు కావచ్చు.. కానీ తల్లికి కొడుకే.. అలాగే దేశానికి చక్రవర్తే కావచ్చు. గురువుకు మాత్రం ఎప్పటికీ శిష్యుడే.. నేడు గొప్పవారంతా గురువునుండి బయటకు వచ్చినవారే.. గురువు బోధలు ఆకళింపు చేసుకున్న వారెవరైనా జీవితంలో గొప్పవారే అవుతారు. ఒకటవ తరగతి నుండి 12 వ తరగతి వరకు ప్రతి విద్యార్థి 25వేల గంటలు పాఠశాలలో గడుపుతారు. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో ఔన్నత్యాన్ని పెంచుకుంటారు. ఒక తోటను పెంచుతున్న తోటమాలి నిరంతరం ఆ చెట్లకు చీడ పట్టకుండా నీరు సమయానుకూలంగా పోస్తూ కాపాడుతూ ఉన్నట్లే గురువు కూడా విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడతాడనేది వాస్తవం.. కానీ నేడు గురువు ధోరణి వింతగా మారుతోంది. బండెడు హోంవర్కు, డబ్బున్నవారిపట్ల మాత్రమే చూపే మమకారం, కొందరికి మాత్రమే శ్రద్ధగా చదువు చెప్పడం, వేరొకరిని తూలనాడటం, తల్లితండ్రులు పేరున్నవారయితే వారిపిల్లలపై శ్రద్ధ వహించడం, లాంటి పనులు చేయడం లేకపోలేదు. అలాంటివారు ఎప్పటికీ గురువులనిపించుకోలేరు. మంచి చదువు చెబుతూ నిష్పక్షపాతంగా వ్యవహరించే గురువులను పిల్లలు జీవితాంతం ఎలా తలుచుకుంటారో, నిత్య తమను తూలనాడే గురువులను కూడా నిత్యం తలుచుకుంటూ తిట్టుకుంటూనే వుంటారనేది కూడా మరిచిపోకూడదు. అందుకే నేడు టీచర్ల నాణ్యతా పరంగా ఆలోచించాల్సివస్తోంది సగటు ఉపాధ్యాయు డు పాఠం చెబుతాడు. మంచి టీచర్ విషయాల్ని వివరిస్తాడు. మేలిమి ఉపాధ్యాయుడు ప్రదర్శించి చూపుతాడు. గొప్ప గురువు విద్యార్థులను ఉత్తేజితుల్నిచేస్తాడు అనే విలియం ఆర్థర్ వార్డ్ మాటల్ని గీటురాయిగా తీసుకోవాలి. తప్పదు.. ఆధునికత్వం ఎన్ని ఆకతాయిపనులు చేస్తున్నా గురువే జీవితానికి పునాది. భావి భారత నిర్మాణానికి నాంది..

# రాజస్థాన్ పోలీసులు మంచి ప్రయత్నం

### వాహనాలపై కులాల పేర్లు నిషేధం

జైపూర్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు వినూత్న ప్రయత్నాలు చేస్తున్న రాజస్థాన్ పోలీసులు తాజాగా మరో అడుగు ముందుకేశారు. వాహనాలపై ఇక నుంచి కులం పేరు, ఊరి పేరు కనిపించడానికి వీల్లేదంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్వర్గలు పెరగకుండా, ఫలానా వారు ఫలానా కులం అన్న భేదాలు రాకేండా చూడాలని సంకల్పించారు. ఈ నిర్ణయంపై ఇప్పుడు సర్వత్రా హర్షామోదం వస్తోంది. కులం, వృత్తులు, సంస్థలు, హోదాలను వాహనాలపై ప్రదర్శించడం వల్ల సమాజంలో కులతత్వంతో పాటు బేధాభిప్రాయాలు పెరుగుతాయంటూ పౌర సమాజం సీఎం అశోక్ గెహ్లాట్‌కు లేఖ రాసింది. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ పోలీసులు తాజా నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. వాహనదారులు తమ సంస్థల పేర్లు, హోదాలను కూడా వ్యక్తిగత వాహనాలపై ప్రదర్శించకుండా చూడాలని జోధ్‌పూర్, జైపూర్ పోలీస్ కమిషనర్లకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. కాగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారికి రూ. 1000 వరకు చలానా విధించి, అదే సొమ్ముతో ఉచితంగా హెల్మెట్ అందించాలని రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

# గ్రామప్రణాళికకు పేరుండాలి: కడియం

వరంగల్ అర్బన్,సెప్టెంబర్6(నేటినిజం ప్రతినిధి): గ్రామ పంచాయతీ 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమానికి పేరుతో బాగుంటుందని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సూచించారు. గ్రామ వెలుగు , గ్రామ జ్యోతి,గ్రామ దర్శనం లాంటి పేర్లను పరిశీలించాలని ప్రభుత్వానికి విన్నవించారు. విద్య, ఆరోగ్యానికి సంబంధించిన అంశాలు కూడా ప్రత్యేక కార్యాచరణ లో పెట్టాలని సూచించారు. మానవ వనరుల అభివృద్ధి ద్వారానే బంగారు తెలంగాణ సాధ్యమన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గంగదేవిపల్లి లాంటి గ్రామాలు అభివృద్ధి చెందాయని, గంగదేవిపల్లి ని స్ఫూర్తి గా తీసుకోవాలని కడియం అన్నారు. ప్రజల భాగస్వామ్యం తో ప్రజాప్రతినిధులు పని చేస్తే అభివృద్ధి సాధ్యమన్నారు. స్వచ్ఛ గ్రామము దిశగా గ్రామాలను పరిశుభ్రంగా పెట్టడం ద్వారా జబ్బులను దూరంగా ఉంచొచ్చని అన్నారు. మన తర్వాత స్వాతంత్య్రం పొందిన దేశాలు విద్య,వైద్యం లో మన కన్నా ముందు ఉన్నాయని కడియం తెలిపారు.

## నిమజ్జనం కోసం భారీ బందోబస్తు: సిపి

హైదరాబాద్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై పోలీసు సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ప్యాట్నీలోని మహబూబ్ కాలేజీలో నిర్వహించారు. బాలాపూర్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు 21 కిలోమీటర్ల మేర నిమజ్జనం ప్రక్రియ ఉంటుంది అని సీపీ తెలిపారు. గణేష్ నిమజ్జనానికి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం. నిమజ్జనం జరిగే సమయంలో ప్రతి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. నిమజ్జనానికి భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జనం ర్యాలీ సజావుగా జరిగేలా చూడాలి అని పోలీసులకు సీపీ సూచించారు.

## ఎపి భవన్ ప్రత్యేకాధికారిగా రమణారెడ్డి

న్యూఢిల్లీ,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రత్యేక కమిషనర్, ఎక్స్ అఫిషియో కమిషనర్‌గా నియమితులైన ఎన్‌వి రమణారెడ్డి గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ భవన్ అసిస్టెంట్ కమిషనర్లు, అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఐఆర్‌పీఎస్ (1986) బ్యాచ్ అధికారి అయిన రమణారెడ్డి ఇండియన్ రైల్వే లోను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రోటోకాల్ విభాగం సెక్రటరీగా, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం మాతృ సంస్థ అయిన ఇండియన్ రైల్వేలోని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ విభాగంలో పనిచేస్తూ తిరిగి డిప్యుటేషన్‌పై ఆంధ్రప్రదేశ్‌కి వచ్చిన రమణారెడ్డిని న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రత్యేక కమిషనర్, ఎక్స్ అఫీషియో కమిషనర్, టూరిజం శాఖ కమిషనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే.

# వందరోజుల్లో ఆకాశమంత విజయం

హైదరాబాద్, సెప్టెంబర్ 6:ఆర్థిక మందగమనం ఎలా ఉన్నా దేశంలో సమర్థమైన పాలన సాగేలా మోడీ తీసుకుంటున్నచర్యలు దేశంలోనే గాకుండా, ప్రపంచంలోనూ ప్రశంసలు వస్తున్నాయి. అగ్రరాజ్యాలు అమెరికా,రష్యాలతో స్నేహం చెడకుండా వాటితో బంధాన్నికొనసాగిస్తున్న తీరు మోడీ చాతుర్యానికి నిదర్శనంగా చూడాలి. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత ఈ వందరోజుల్లో అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడం మోడీ ప్రభుత్వానికే సాధ్యమయ్యింది. ప్రజల కోసం పని చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్న ప్రభుత్వంగా మోడీ నిరూపించు కున్నారు. వంద రోజుల పాలనలో మోడీ సారథ్యంలోని రెండో ప్రభుత్వం ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన విజయాలను సాధించింది. అన్నింటికి మించి 370 ఆర్టికల్ రద్దు చేయడం, పాక్‌ను ఏకాకి చేయడం అన్నది ప్రపంచ చరిత్రలో అద్భుతమైన విజయంగా చూడాలి. అది బిజెపి మాత్రమేచేయగలదని నిరూపించారు. ఇదే క్రమంలో అవినీతి నేతలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. చిదంబరం, డికె శివకుమార్‌ల అరెస్ట్ వ్యవహారాలు చూస్తుంటే అవినీతి నేతలను బొక్కలో తోయడానికి మోడీ వెనకాడడని నిరూపించారు. ఇలా రాజకీయాలను అడ్డం పెట్టుకుని ప్రజాధనాన్ని దోచుకున్న దగుల్బాజీలను బొక్కలో తోస్తే ప్రజలు జేజేలు పలుకుతారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోడీ తన తొలి వందరోజుల పాలనలో పలు కీలక నిర్ణయాలను తీసుకోవడమే గాకుండా వాటిని అమలు చేసి చూపారు. ఆయన వందోరోజున సరిగ్గా చంద్రాయాన్ సక్సెస్ కావడం ఆకాశమంత విజయంగా చూడాలి. ఇకపోతే ముస్లిం మహిళలకు రక్షణగా ట్రిపుల్ తలాక్ రద్దుకూడా అతిపెద్ద విజయంగానే చూడాలి. భారతదేశంలోని ముస్లిం మహిళలకు సామాజిక ప్రతిష్ఠను, గౌరవ మర్యాదలను అందించేందుకై మోడీ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ చట్టం నిదర్శనంగా చూడాలి. ఎన్డీయేతర పార్టీలు కూడా తక్షణ తలాక్ బిల్లుకు మద్దతు ఇవ్వడం మోడీ విజయంగా చూడాలి. ఈ విజయాలను చూస్తున్న ప్రజలు ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతి కావాలని కోరుకుంటున్నారు. అలాగే రాజకీయా సంస్కరణలు కూడా కోరుకుంటున్నారు. దేశంలో అవినీతి రహిత రాజకీయాలను ప్రజలు కోరుకుంటున్నారు. ఈ దిశగా మోడీ కఠిన చర్యలకు ఉపక్రమిస్తే ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉంటుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ రెండో ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలతో పురోగమించాలని కోరుకుంటు న్నారు. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని రద్దు చేయడం ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం. ఏడు దశాబ్దాలుగా అపరిష్కృతంగావున్న కశ్మీర్ సమస్యను ప్రధాని మోడీ ప్రభుత్వం 70 రోజుల్లో అనితరసాధ్యంగా పరిష్కరించింది. ఆర్టికల్ 370 రద్దుతో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, దివంగత ప్రధాని వాజపేయి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ల స్వప్నం సాకారమైంది. పార్లమెంట్ చరిత్రలో చిరస్థాయిగా గుర్తుండిపోయే రోజుగా 2019 ఆగస్టు 5 చరిత్రలో నిలిచిపోతుంది. పార్లమెంటు తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమవుతాయనడంలో సందేహం లేదు. మోదీ సర్కార్ తీసుకున్న సాహసోపేతమైన ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం తరవాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి స్వదేశంలోనే కాక విదేశాల్లో సైతం బ్రహ్మరథం పడుతు న్నారు. ముఖ్యంగా ముస్లిం దేశాల్లో ఆయనకు ఎర్ర తివాచి పరుస్తు న్నారు. బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వాలు తమ దేశ అత్యున్నత పౌర పురస్కారా లను మోదీకి ప్రదానం చేశాయి. దీంతో కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ అంతర్జాతీయ సమాజంలో పూర్తిగా ఏకాకి అయ్యింది. ఇది మోదీ రాజనీతిజ్ఞతకు ఒక తిరుగులేని నిదర్శనంగా చూడాలి. ఇకపోతే దేశరక్షణ వ్యవస్థలో ఒక అతి పెద్ద సంస్కరణకు మోదీ సర్కార్ పూనుకున్నది. ఆగస్టు 15న ఎర్రకోట నుండి జాతిని ఉద్దేశించి

ప్రసంగిస్తూ త్రివిధ సాయుధ బలగాలను సమన్వయ పరచడానికి వాటికి ఉమ్మడిగా ఒక మహాదళాధిపతి నియమించనున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించారు. కాలం చెల్లిన చట్టాలను రద్దు చేసేందుకు మోదీ సర్కార్ సంకల్పించింది. ఇంతవరకు దాదాపు 250 చట్టాలను రద్దు చేసింది. ఇదే సమయంలో శ్రమ జీవులకు మేలు చేసే కార్మిక చట్టాలపై దృష్టి సారించి నాలుగు చట్టాల స్థానంలో ఒకే చట్టంగా 'వేతనాల కోడ్ -2019' ను రూపొందించింది. భారతదేశ అంతరిక్ష ప్రస్థానంలో ప్రతిష్ఠాత్మకమైన చంద్రయాన్-2 ప్రాజెక్ట్ విజయవంత మవడం మనకు గర్వకారణం. ఇప్పటి వరకు అమెరికా, రష్యా, చైనా దేశాలు మాత్రమే చంద్రుడిపై పరిశోధ నలు చేశాయి. చంద్రయాన్-2తో ఆ దేశాల సరసన భారత్ కూడా చేరింది. సంస్కరణల్లో వేగం, ప్రతి ఒక్కరికీ సంక్షేమం, సామాజిక న్యాయం వంటి విషయాల్లో మోదీ సర్కార్ మొదటి విడత పాలనలో కంటే ఈ వంద రోజుల్లోనే విశేష స్థాయిలో సత్ఫలితాలు సమకూరాయి. ఫలితంగా ప్రధాని మోదీ నాయకత్వ పటిమ, పాలనా దక్షతపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. దీర్ఘకాల ప్రయోజనాలపైనే మోదీ సర్కార్ దృష్టిని కేంద్రీకరించింది. ఈ క్రమంలో దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఇంకా యుద్ధంచేయాల్సి ఉంది. అవినీతి రహిత పాలనతో పాటు రాజకీయ అవినీతిని పారద్రోలాలి. రాజకయిాఆల్లో వారసత్వాన్ని రూపుమాపాలి. ఒకేదేశం, ఒకే చట్టం అన్ననినాదాం రావాలి. జనాభా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ సాకారం చేసే దిశగా అడుగులు వేస్తే మోడీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. అలాగా భారత్ బలమైన దేశంగా ఎదుగుతుంది.

# అన్నదాతల ఆదాయం రెట్టింపే లక్ష్యం

## అందుకు అనుగుణంగా మోదీ సర్కార్ కసరత్తు

న్యూఢిల్లీ,సెప్టెంబర్6 (ఆంఎన్ఎ): స్వతంత్ర భారతదేశానికి 2022లో 75 ఏళ్లు నిండుతాయి. స్వాతంత్య్ర అమృతోత్సవాల నాటికి అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేయడం మోదీ సంకల్పాలలో ముఖ్యమైనది. ఇక 2024లో ఎన్డీఏ రెండో ప్రభుత్వ ఐదేళ్ల గడువు ముగుస్తుంది. 2024 లోగా మన యువతకు ఉపాధి అవకాశాలను విస్తరింపజేసి, శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యమిస్తూ, ప్రజల జీవన స్థితిగతులను పెంపొందించడమే నరేంద్రమోదీ ప్రభుత్వ మహా లక్ష్యంగా చెప్పుకుంది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ తన తొలి వంద రోజుల పాలనలో పలు కీలక నిర్ణయాలను త్వరితగతిన అమలు పరిచారు. అసాధారణ విజయాలతో కొత్త చరిత్రను సృష్టించారు. ప్రస్తుతం ప్రపంచంలో మన దేశం ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ఐదేళ్ల క్రితం మనం 11వ స్థానంలో ఉండేవాళ్లం అని గుర్తించాలి. 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన తరువాతనే మనం ఐదో స్థానానికి పురోగమించాం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బ్జడెట్టే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ముఖ్యంగా 25 శాతం కార్పొరేట్ పన్ను చెల్లించడానికి ఇప్పుడున్న వార్షిక టర్నోవర్ పరిమితి రూ. 250 కోట్లను రూ. 450 కోట్లకు పెంచింది. ఫలితంగా చాలా సంస్థలు ఈ పన్ను నుండి విముక్తమవుతాయి. జీఎస్టీలో రిజిస్టరైన కొన్ని సంస్థలు తీసుకునే రుణాలపై 2 శాతం వడ్డీ రాయితీ ఇచ్చేందుకు రూ. 350 కోట్లు కేటాయించారు. కోటిన్నర కన్నా తక్కువ వార్షిక టర్నోవర్ ఉండే రిటైల్ వ్యాపారులు, చిన్న దుకాణదారులకు కొత్తగా పింఛన్ వథకాన్ని ప్రవేశపెట్టారు. గ్రామీణ సడక్ యోజన సహా పలు పథకాలకు కేటాయింపులు పెంచారు. రానున్న ఐదేళ్ళలో రూ. 80వేల కోట్లతో 1,25,000 వేల కి.మీ. రహదారుల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశిరచుకున్నారు. రైతుల సంక్షేమానికి మోదీ సర్కారు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ముందుకు సాగుతోంది. దిగుబడులకు తగిన గిట్టుబాటు ధర అందించాలన్నది రైతుల డిమాండ్. ఈ డిమాండ్‌ను నెరవేర్చడానికై 24 పంటల విషయంలో ఉత్పత్తికి అయ్యే ఖర్చుకు అదనంగా యాభై శాతం రైతులకు గిట్టుబాటు అయ్యే విధంగా మోదీ సర్కార్ చర్యలు చేపట్టింది. 2022 సంవత్సరం నాటికి రైతుల ఆదాయాలు రెట్టింపు చేయాలన్నది మోదీ ప్రభుత్వ సంకల్పం. ఈ సంకల్ప సాధనకై ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఆరు వేల రూపాయలు మంజూరు చేసే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పరిధిలోకి ఇప్పటికే 14 కోట్ల మంది రైతులను తీసుకువచ్చారు. సాగుదారులు అందరికీ పింఛను పథకం అమలుపరచాలని మోదీ ప్రభుత్వం తీర్మానించింది. ఒకరాష్ట్రాల మధ్య తలెత్తే నదీ జలాల వివాదాలను దశాబ్దాలపాటు కొనసాగనివ్వకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడానికి మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో వున్నది. ఇందుకు అనుగుణంగా 'అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కార చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రస్తుతం ఉన్న విభిన్న ట్రిబ్యునళ్ల స్థానంలో ఒకే శాశ్వత ట్రిబ్యునల్‌ను కేంద్రం ఏర్పాటు చేస్తుంది. ఈ ట్రిబ్యునల్ ఒకసారి తీర్పు వెలువరిస్తే అదే అంతిమం. వైద్య రంగంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ చట్టాన్ని మోదీ సర్కార్ తీసుకువచ్చింది. ఇది, దేశ వైద్య రంగ చరిత్రలో ఒక అతిపెద్ద సంస్కరణగా నిలిచిపోతుంది. ప్రభుత్వ సీట్లతో పాటు 50 శాతం ప్రైవేట్ సీట్లు కూడా ఆర్థికంగా వెనుకబడిన మెరిట్ విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి. అలాగే పిల్లలపై జరిగే అకృత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని తీసుకువచ్చారు. అవినీతి, లైంగిక వేధింపులకు పాల్పడిన సివిల్ సర్వెంట్లను స్వచ్ఛంద పదవీ విరమణ చేయించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టారు. తద్వారా అవినీతి విషయంలో ఎలాంటి వారినైనా ఉపేక్షించేదిలేదని మోదీ ప్రభుత్వం ఆచరణాత్మకంగా హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించటం లక్ష్యంగా కేంద్రం జల్‌శక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసింది. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఈ శాఖ అధికారులు పర్యటిస్తూ వాననీట ఇసంరోణపై కార్యక్రమాలు ఉధృతం చేస్తున్నారు.

## నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు: డిసిపి

హైదరాబాద్,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): రోడ్డు భద్రత, ప్రయాణజకుల క్షేమం కోసమే కేంద్ర ప్రభుత్వం కొత్త మోటార్ వెహికల్ చట్టం తీసుకువచ్చిందని సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ విజయ్ అన్నారు. వాహనదారులు జరీమానాలు చూసైనా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడకుండా ఉంటారని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కొత్త మోటార్ వెహికల్ చట్ట ం అమలులోకి వచ్చింది. అయితే హైదరాబాద్‌లో ఇంకా అమలు చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఆదే శాల కోసం ఎదురు చూస్తు న్నా మని అన్నారు. ట్రాఫిక్ ఉల్లం ఘనలపై ఎంత జరిమానా విధిం చాలన్న దానిపై ప్రభుత్వం నిర్ణయించి.. ఆదేశాలు ఇచ్చిన తర్వాత పక్కా అమలు చేస్తామని డీసీపీ తెలిపారు. వాహనదారుడు భద్రంగా ఇంటికి వెళ్లాలని, రవానా చట్టం లోని నిబంధనలు ఉల్లంఘించకూడదని డీసీపీ సూచించారు.

# డెంగీ నిర్ధారణ కోసం జిల్లాలకు పరుగు

### విషజ్వరాల బారిన పడడంతో ఆందోళన
### తక్షణ వైద్యం అందక సామాన్యుల విలవిల

హైదరాబాద్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): విషజ్వరాల కారణంగా ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రజలు తక్షణ వైద్యం కోసం నగరాలకు పరుగెత్తుతున్నారు. దీంతో జిల్లాల్లో పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు. జిల్లాల్లో డెంగీ నిర్ధారణ కోసం కనీస సదుపాయాలు లేకపోవడంతో అనుమానిత కేసులన్నింటిని జిల్లాలో ఉన్నప్రధాన అస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. రెఫరల్ కేసుల్లో 80 నుంచి 90 శాతం కేసులు డెంగీగానే తేలుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా వర్షాకాలంలో విష జ్వరాలు పెద్ద ఎత్తున ప్రబలడం జరుగుతోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో అక్టోబర్, నవంబర్ మాసం వరకు విష జ్వరాలు, మలేరియా, టైపాయిడ్ వంటి జ్వరాలు కేసులు నమోదు అవుతాయని చెబుతూ డెంగీ నిర్ధారణ సౌకర్యాలే లేనప్పుడు డెంగీగా నిర్ధారణ ఎలా చేస్తారని వైద్య ఆరోగ్య శాఖ ధర్మ సందేహాలు వ్యక్తం చేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఎడతెరిపి లేకుండా పక్షం రోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో దోమలు విజృంభించి జనం మంచం పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంతటా ఎక్కడ చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నారు. గతంలో చికెన్‌గున్యా, టైఫాయిడ్ వంటి జ్వరాలు కనిపిస్తే ఈసారి మాత్రం డెంగీ కేసులు భారీగా నమోదు అవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు మొదలుకుని ప్రైవేటు నర్సింగ్ హోంల వరకు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఒక్కో ఆసుపత్రిలో సగటున 200కు పైగా అవుట్ పేషంట్లు నమోదు అవుతున్నారంటే పరిస్థితిని ఊహించవచ్చు. ఆర్థిక స్థోమత కలిగిన బాధితులు మెరుగైన వైద్యం కోసం పట్టణాలకు పరుగులు తీస్తుంటే పేదలకు మాత్రం స్థానికంగా ఉండే ఆర్ఎంపీ, పీఎంపీలే పెద్ద దిక్కుగా మారారు. మైదాన ప్రాంతం అధికంగా ఉన్న ప్రాంతాల్లోనూ డెంగీ వేగంగా విస్తరిస్తున్నది. డెంగీ వ్యాధి నిర్ధారణ కిట్లు జిల్లాలో ఎక్కడా అందుబాటులో లేవు. డెంగీ నిర్ధారణ అయిన తరువాత చికిత్స కోసం ప్లేట్‌లేట్ సపరేటర్స్ వంటి యంత్రాలు అవసరమవుతాయి. అయితే జిల్లాలోని ఏ ఆసుపత్రిలోనూ నిపుణులను నియమించక పోవడంతో ఆ పరికరాల ఏర్పాటు కూడా మరుగున పడిపోయింది. జిల్లాల్లో విష జ్వరాల తీవ్రత పెరగడంతో రోగులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఇందులో సాధారణ జ్వరాలకు ఇక్కడే తాత్కాలిక చికిత్స చేపడుతున్నారు. అయితే జ్వరాలు తగ్గకుండా తరుచూ వస్తుంటే ఆ రోగులను ప్రధాన ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. ముఖ్యంగా టైపాయిడ్, మలేరియా అనుమానిత కేసులను ప్రైవేటు వైద్యులు ఉన్నత ఆసుపత్రులకు పంపుతున్నట్లు చెబుతున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో విష జ్వరాల కంటే అధికంగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ కేసులు నమోదు కావడంతో ముందు జాగ్రత్త చర్యగా అనుమానిత రోగులను సమగ్ర పరీక్షల కోసం సిఫారసు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాల్లో డెంగ్యూ జ్వరాలకు సరైన చికిత్స వసతులు ఇక్కడ అందుబాటులో లేవు. ఈ కారణంగానే పొరుగు జిల్లాలకు వెళ్తున్నట్లు రోగులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మామూలు వైరల్ జ్వరాలు వచ్చిన సందర్భాల్లోనూ ప్లేట్ లెట్స్ తగ్గి పోవడం సర్వసాధారణమేనని వైద్యులు చెబుతున్నారు. అయితే గ్రామాల్లో ఉండే ఆర్ఎంపీ, పీఎంపీల మాటలు నమ్మి పొరుగు జిల్లాలకు పరుగులు పెరుగుతున్నారన్నది ఆరోగ్య శాఖ వర్గాల వాదన. ముఖ్యంగా నిలువ ఉన్న నీటి వనరులు, బురద, మురికి కాలువలపై దోమల వృద్ధి వేగంగా జరుగుతుందని ఆరోగ్య శాఖాధికారులు చెబుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పారిశుధ్య నిర్వహణ కోసం స్థానిక సంస్థలు మొదలుకుని మున్సిపాలిటీల వరకు శ్రద్ధ చూపక పోవడమే ఈ పరిస్థితికి కారణమని ఆరోగ్య శ్శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలకు ముందు దోమల నియంత్రణ కోసం మందులు పిచికారి చేసినట్లు అధికారులు చెబుతున్నా పట్టణాల్లోనే పారిశుధ్య నిర్వహణ దారుణంగా తయారైన పరిస్థితి కనిపిస్తోంది. ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల్లో డెంగీ కేసుల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఇక్కడి రోగనిర్ధారణ సదుపాయాలను పరిశీలిస్తే దారుణంగా ఉన్నట్లు తేలింది. సాధారణ జ్వరాలను మినహాయిస్తే మిగితా రోగాల నిర్ధారణకు ఇతర జిల్లాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.

## మొక్కలు నాటిని వారికి వనమిత్ర అవార్డులు

హైదరాబాద్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను స్వీకరించి మొక్కలు నాటిన వారందరికీ డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం వనమిత్ర బ్యాడ్జ్ ఆఫ్ హానర్ అవార్డ్స్ ఇవ్వాలని ఇగ్నైటింగ్ మైండ్స్ సంస్థ నిర్ణయించింది. ఇందులో భాగంగా రూపొందించిన అవార్డ్స్ ను రాజ్యసభ ఎంపీ, సంస్థ ప్యాట్రన్ జోగినపల్లి సంతోష్ కుమార్ ఇవాళ ఆవిష్కరించారు. మొక్కలు నాటిన వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ అవార్డ్స్ కు రూపకల్పన చేసిన సంస్థ ఫౌండర్ కరుణాకర్ రెడ్డి, కో ఫౌండర్ రాఘవను ఎంపీ సంతోష్ కుమార్ అభినందించారు. మొక్కలు నాటిన వారందరికీ వనమిత్ర అవార్డులను త్వరలో అందజేస్తామని సంస్థ కో ఫౌండర్ రాఘవ ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటివరకు ఒక కోటి 13 లక్షల మంది భాగస్వామ్యంతో రెండు కోట్ల 83 లక్షల మొక్కలు నాటినట్లు వివరించారు.

# దొంగతనం అనుమానంతో మహిళకు అవమానం

## బట్టలూడదీసి కొట్టిన పోలీసులు

## విచారణకు ఆదేశించిన అధికారులు

న్యూఢిల్లీ,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): దొంగతనం నెపంతో ఓ మహిళ బట్టలూడదీసి పోలీసులు చితక్కొట్టారు. ఈ దారుణ సంఘటన గురుగ్రామ్‌లోని ఓ పోలీసు స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. డీఎల్ఎఫ్ ఫేజ్ 1 పోలీసు స్టేషన్ పరిధిలో అసోంకు చెందిన 30 ఏళ్ల మహిళ ఓ ఇంట్లో పనిమనిషిగా పని చేస్తోంది. అయితే ఆ ఇంట్లో దొంగతనం జరిగిందని.. పనిమనిషిపై అనుమానం వ్యక్తం చేసిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పనిమనిషిని పోలీసు స్టేషన్‌కు పిలిపించారు పోలీసులు. ఆ తర్వాత ఆమెను ఏఎస్ఐ మధుబాల లాకప్ రూమ్‌లో బంధించింది. అనంతరం పనిమనిషి బట్టలు విప్పించి బెల్టులు, బ్యాటన్‌లతో విచక్షణారహితంగా చితకబాదింది ఆ మహిళా పోలీసు అధికారి. దొంగతనం చేసినట్లు ఒప్పుకోవాలని ఆమెను పోలీసులు బలవంతం చేశారు. ఆమె నేరం చేసినట్లు అంగీకరించకపోవడంతో ప్రయివేటు భాగాల్లో కూడా దారుణంగా కొట్టారు. దీంతో పనిమనిషి, ఆమె భర్త కలిసి గురుగ్రామ్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసు కమిషనర్ విచారణకు ఆదేశించారు. పనిమనిషిని చితకబాదిన ఎస్‌హెచ్‌వో సవైట్ కుమార్, ఏఎస్ఐ మధుబాల, హెచ్‌సీ అనిల్ కుమార్, మహిళా కానిస్టేబుల్ కవితపై చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# కొడుకును సీఎం చేసేందుకే సెక్రటేరియట్ కూల్చివేత

### - బీజేపీ నేత వివేకానంద

మంచిర్యాల, సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ) : కొడుకును సీఎం చేసేందుకు కేసీఆర్ సెక్రటేరియట్‌ను కూల్చివేస్తున్నారని బీజేపీ నేత గడ్డం వివేకానంద విమర్శించారు. జిల్లాలోని వెన్నెల మండల కేంద్రంలో అక్రమ కేసులకు గురైన 12మంది బీజేపీ కార్యకర్తలను ఎంపీటీసీ హరీశ్ గౌడ్ ఇంటిలో ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే దళిత నాయకుడిని ముఖ్యమంత్రి చేస్తానని మాటిచ్చి మోసం చేశారని విమర్శించారు. టీఆర్ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ తన కొడుకును ముఖ్యంత్రిని చేయటం కోసం సెక్రటేరియట్‌ను కూల్చి వేయడానికి సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటూ కేసీఆర్ ఓ తుగ్లక్ ముఖ్యమంత్రిగా వ్యవహిరిస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ప్రతిభావంతులైన ఇంజనీర్లతో కాకుండా.. తనకు తొత్తులుగా వ్యవహరించే రిటైర్డ్ ఇంజనీర్లతో పని చేయిస్తూ ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా తుమ్మిడి వాట్టి నుంచి ప్రవహించే ప్రాణహిత నీటిని కాళేశ్వరం ప్రాజెక్టులో పోస్తూ, మూడు మీటర్ల ఎత్తులో నీటిని పంపిణీ చేసూ ప్రభుత్వ సొమ్మును దుబారా చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పనిచేస్తున్న పోలీసులందరినీ తన పార్టీ కార్యకర్తల్లా పనిచేయించుకుంటూ బీజేపీ నాయకులపై అక్రమంగా కేసులను వేస్తున్నారని

# నవభారత నిర్మాణమే లక్ష్యం

### - తూర్పు దేశాలతో భారత్ సంబంధం ఈనాటిదికాదు
### - 2024 నాటికి 5లక్షలకోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
### - ప్రధాని నరేంద్ర మోదీ
### - రష్యా అభివృద్ధికి బిలియన్ డాలర్ల రుణం..

రష్యా, సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ) : సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అనే నినాదంతో నూతన భారతావని నిర్మాణానికి నడుం బిగించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రష్యాలోని వ్లాడివోస్టోక్ వేదికగా జరుగుతోన్న తూర్పు దేశాల ఆర్థిక ఫోరం (ఈఈఎఫ్) ఐదో సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మోదీ ప్రసంగించారు. తూర్పు దేశాల్లో మానవ సంక్షేమం కోసం ఈఈఎఫ్ చేపట్టిన చర్యలు మొత్తం మానవాళి సంక్షేమానికి ఉపయోగపడతాయని తాను బలంగా నమ్ముతున్నానని వ్యాఖ్యానించారు. తూర్పు దేశాలతో భారత్‌కు చాలా ఏళ్లుగా బలమైన సంబంధాలు ఉన్నాయని, వ్లాడివోస్టోక్‌లో కాన్సులేట్ ప్రారంభించిన తొలి దేశం తమదేనని మోదీ పేర్కొన్నారు. సోవియట్ రష్యాలో విదేశీయులపై నిషేధం ఉన్న కాలంలోనూ వ్లాడివోస్టోక్‌లో మాత్రం భారతీయులను అనుమతించిన విషయాన్ని గుర్తుచేశారు. 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' నినాదంతో నవభారత్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, 2024 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను ఐదు ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తూర్పు తీరంలో అభివృద్ధికి రష్యాతో కలిసి నడుస్తామని మోదీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 'యాక్ట్ ఫర్ ఈస్ట్'పాలసీని ఆవిష్కరించిన ప్రధాని.. తూర్పు తీరం అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాదు ఈ ప్రాంతాభివృద్ధికి రష్యాకు ఒక బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందజేయనున్నట్టు మోదీ ప్రకటించారు. 'యాక్ట్ ఫర్ ఈస్ట్' విధానంలో భాగంగా తూర్పు ఆసియాలో భారత్ చురుకుగా వ్యవహరించనుందని, ఇది తమ ఆర్థిక దౌత్యంలో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుందని అన్నారు. మరోవైపు, భారత్, రష్యాల మధ్య రక్షణ, ఇంధన సహా పలు రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోడమే లక్ష్యంగా బుధవారం జరిగిన చర్చల్లో మొత్తం 10.45 లక్షల కోట్లు విలువ చేసే 15 ఒప్పందాలు కుదిరాయి. వాణిజ్యం, పెట్టుబడులు, ఆయిల్, గ్యాస్, అణు శక్తి, రక్షణ, అంతరిక్షం, సముద్ర రవాణా తదితర అంశాలలో సహకారంపై మోదీ చర్చించారు. తాము ఇతర దేశాల అంతర్గత విషయాల్లో జోక్యానికి వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. ఇస్రో చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టుకు సహకరిస్తోన్న రష్యా ఆస్ట్రోనాట్స్‌కు శిక్షణ ఇవ్వనుంది. తమ మధ్య స్నేహం మరింత బలపడుతోందని, వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల ప్రయోజనం కలగడమే కాదు, ప్రజల అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుందని మోదీ పేర్కొన్నారు.

# గవర్నర్ నరసింహన్‌కు ఘనంగా వీడ్కోలు సభ

### 7న ఏర్పాటు చేసిన ప్రభుత్వం

### పాల్గొననున్న సిఎం కెసిఆర్, మంత్రులు, అధికారులు

హైదరాబాద్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): గవర్నర్ నరసింహన్‌కు ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం వీడ్కోలు సభ నిర్వహించనుంది. ఈ వేడుకకు సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. 8వ తేదీన కొత్త గవర్నర్‌గా తమిళిసై సౌందర్ రాజన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ క్రమంలో 7వ తేదీనే గవర్నర్ నరసింహన్‌కు ప్రభుత్వం వీడ్కోలు సభ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఉమ్మడి ఎపిలో గవర్నర్‌గా వచ్చిన నరసింహన్ ఇటీవల తెలంగాణకు మాత్రమే గవర్నర్‌గా కొనసాగారు. ఆయన తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక భూమిక పోషించారు. 2010 జనవరిలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నరసింహన్ బాధ్యతలు స్వీకరించారు. 2012 మేలో మరో ఐదేండ్లు ఆయన పదవీకాలాన్ని కేంద్రం పొడిగించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2 జూన్ 2014 నుంచి ఆయన రెండు తెలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా కొనసాగారు. కొద్ది రోజుల క్రితమే కేంద్రం ఏపీకి నూతన గవర్నర్‌ను నియమించగా.. అప్పటినుంచి నరసింహన్ తెలంగాణ గవర్నర్‌గా కొనసాగుతున్నారు. నరసింహన్ సతీమణి విమలా నరసింహన్. వారికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు మనుమలు, మనుమరాండ్లు ఉన్నారు. నరసింహన్ 1945లో తమిళనాడులో జన్మించారు. హైదరాబాద్‌లోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్లో ప్రాథమిక విద్యాభ్యాసం. తదుపరి చదువు మద్రాసులో కొనసాగింది. మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాల నుంచి పొలిటికల్ సైన్స్‌లో గోల్డ్‌మెడల్. మద్రాసు లా కళాశాలలో న్యాయవిద్యను అభ్యసించారు. 1968లో సివిల్ సర్వీసెస్‌లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఆయనను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించారు. కొంతకాలం నంద్యాలలో, ఆపై ఒంగోలులోని నరసరావుపేటలో పనిచేశారు. 1972లో ఇంటెలిజెన్స్ బ్యూరోకు వెళ్లారు. అప్పటినుంచి 2006 డిసెంబర్‌లో రిటైర్ అయ్యేవరకు అక్కడే పనిచే శారు. సర్వీసు చివరలో ఏడాదికాలంపాటు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేశారు. రెండుదఫాలుగా విదేశీ వ్యవహారాల శాఖలో పనిచేశారు. 1981-84 మధ్య మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ఫస్ట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. 1996 నుంచి 1999 వరకు విదేశాల్లోని రాయబార కార్యాలయాల భద్రతా వ్యవహారాలు చూశారు. నేషనల్ డిఫెన్స్ కాలేజీ పూర్వ విద్యార్థి అయిన నరసింహన్‌కు సంగీతం అంటే ఇష్టం. కర్ణాటక, హిందుస్థానీ సంగీతాన్ని బాగా ఆస్వాదిస్తారు. 2006 డిసెంబర్‌లో నరసింహన్ రిటైర్ అయిన వెంటనే.. ఆయనను ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆ సమయం లో మావోయిస్టుల ప్రాబల్యాన్ని తగ్గించడానికి నరసింహన్ విశేష కృషిచేశారు.

# రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ఎరువుల కొరత

### - కేంద్రం సంమృద్ధిగానే ఎరువులు అందించింది
### - బీజేపీ ఎంపీ అర్వింద్

నిజామాబాద్, సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ) : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని, రైతుల రాజ్యం అని గొప్పలు చెబుతున్న తెరాస ప్రభుత్వం.. సకాలంలో ఎరువులు అందించలేక పోతుందని బీజేపీ ఎంపీ అర్వింద్ విమర్శించారు. జిల్లాలో ఏర్పడ్డ యూరియ కొరతపై గురువారం ఆయన మాట్లాడారు. ఎరువుల కొరత ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని, రాష్ట్రానికి కావాల్సిన ఎరువులను కేంద్రం సమృద్ధిగానే పంపిదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దానికంటే కేంద్రం ఎక్కువ ఇచ్చి నిల్వ చేసుకోమని చెప్పిందని, కేసీఆర్ కుటుంబానికి ప్రాజెక్టుల మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదని విమర్శించారు. కేంద్ర నిధులు కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుకే మళ్లిస్తున్నారని, అందుకే జిల్లాలో యూరియా కొరత ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడుతుంటే కేసీఆర్ ఫామ్ హౌజ్‌కే పరిమితం అయ్యారని, జిల్లాలో టీఆర్ఎస్ పార్టీని గెలిపించలేదనే కక్ష్య సాధింపుతోనే ఎరువులు ఇవ్వడం లేదని ఎంపీ అర్వింద్ దుయ్యబట్టారు.



హైటెక్స్‌లో జరుగుతున్న అగ్రిటెక్ సదస్సును ప్రారంభించిన మంత్రి నిరంజన్ రెడ్డి

### గ్రామ అభివృద్ధి కోసం..

# రాజకీయాలకు అతీతంగా పనిచేయండి?

### - ప్రతీ గ్రామం అభివృద్ధికోసం 30రోజుల ప్రణాళిక
### - కార్యదర్శికంటే ఉపసర్పంచ్‌కే ఎక్కువ గౌరవం ఉంటుంది
### - కార్యదర్శులకు చెక్‌పవర్ అడిగేవారు ప్రభుత్వ వ్యతిరేక సర్పంచ్‌లే
### - పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వరంగల్, సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ) : గ్రామ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని మంత్రి దయాకరరావు అన్నారు. వరంగల్ నగరంలో జరిగిన 30రోజుల ప్రణాళిక కార్యక్రమం సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతీ గ్రామం అభివృద్ధి కోసం 30రోజుల ప్రణాళికను ఏర్పాటు చేశామని అన్నారు. గ్రామ కార్యదర్శికంటే ఉపసర్పంచ్ కే ఎక్కువ గౌరవం ఉంటుందని ఆయన చెప్పారు. కార్యదర్శులకు చెక్ పవర్ అడిగే వారు ప్రభుత్వ వ్యతిరేక సర్పంచ్ లేనని మంత్రి అన్నారు. మిషన్ భగీరథ పనులు మొదలుపెట్టినపుడు విమర్శించిన వారు.. ఇప్పుడు ముక్కున వేలేసుకుంటున్నారని అన్నారు. ప్రతి గ్రామానికి ఒక కార్యదర్శి నియామకం చేస్తున్నామని దయాకర్ రావు చెప్పారు. గ్రామాల అభివృద్ధికోసం రూ.348 కోట్ల నిధులను విడుదల చేశామని చెప్పారు. ప్రతీ పైసా అభివృద్ధికి ఉపయోగపడాలని అన్నారు. సర్పంచ్ ఆదేశాల మేరకే ఫీల్డ్ అసిస్టెంట్ పని చేయాలని మంత్రి స్పష్టంచేశారు. గతంలో లేని విధంగా నిధులు, అధికారులు అందుబాటులో ఉండటంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ఇదే మంచి అవకాశముందని దయాకర్ రావు అన్నారు. రాష్ట్రానికి కోటీ 20 లక్షల చింత చెట్లు కావాలని అన్నారు. ప్రతి గ్రామపంచాయితీ సర్పంచ్ లు అధికారులు కూర్చుని తమ తమ గ్రామానికి ఎన్ని మొక్కలు కావాలో నిర్ణయించుకోవాలని, అయితే ప్రతీ మొక్క బతకాలని చెప్పారు. గ్రామ అభివృద్ధి కోసం దాతలను గుర్తించాలని చెప్పారు. ఇక నుంచి చిత్తశుద్ధితో పని చేయాలని, ప్రతి గల్లీ పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. ఎజెండా లో ఉన్న అంశాలనే కాకుండా.. మీ ఊరికి ఎంకావాలో అన్నింటిని గుర్తించి చెప్పాలని సర్పంచ్ లకు తెలిపారు. గ్రామంలోని ప్రతీ అంశంపై సర్పంచ్ లను భాగస్వామ్యం చేస్తున్నామని అన్నారు. స్వీపర్ల నియామకం సర్పంచ్ లకి అప్పగిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ గా ఎన్నిక అవడం చాలా మంచి అవకాశమని.. ఇకపై ప్రతీ సర్పంచ్ తమ తమ గ్రామాలను అభివృద్ధి చేసిచూపాలని మంత్రి చెప్పారు. గ్రామ సర్పంచ్ లు చేసే ప్రతీ కార్యక్రమం భవిష్యత్ తరాలు స్మరించుకునేలా ఉండాలని అన్నారు. అధికారుల సహకారంతో గ్రామ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని? టీం వర్క్ తో పని చేసి 30రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

# ఆదరించి ఆశ్రయమిచ్చిన స్నేహితుడినపైనే పగ

### ఓ యువతి కారణంగా సతీష్‌పై ద్వేషం
### పార్టీ చేసుకుందామంటూ పిలిచి హత్య
### హంతకుడు హేమంత్ అరెస్ట్
### వివరాలు వెల్లడించిన డిసిపి

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సతీష్ హత్య కేసులో మిస్టరీని పోలీసుల ఛేదించారు. నిందితుడు హేమంత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హేమంత్ ఇంట్లోనే సతీష్ మృతదేహాన్ని గుర్తించినట్లు మాదాపూర్ డీసీపీ వెంకటేశ్వరరావు తెలిపారు. గత నెల 28న హత్య జరిగితే.. 29న సతీష్ భార్య కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని చెప్పారు. సతీష్, హేమంత్ కోరుకొండ సైనిక్ స్కూల్లో చదువుకున్నారని తెలిపారు. సతీష్‌కు సాఫ్ట్‌వేర్ స్కిల్స్ నేర్పించే ఇనిస్టిట్యూట్ ఉందన్నారు. హేమంత్ ఏ ఉద్యోగం లేక.. సతీష్ వద్దకు వచ్చి ఉద్యోగంలో చేరాడన్నారు. కొద్దికాలం తర్వాత సాఫ్ట్‌వేర్ స్కిల్స్ ఇనిస్టిట్యూట్‌ను కాస్త సాఫ్ట్‌వేర్ కంపెనీగా చేసి కూకట్‌పల్లికి మార్చారని వెల్లడించారు. వీరి కంపెనీలో విజయవాడకు చెందిన ప్రియాంక చేరిందన్నారు. సతీష్‌తో ప్రియాంక సన్నిహితంగా ఉండేదన్నారు. కానీ అతను ఎక్కువగా పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీంతో ప్రియాంక.. హేమంత్‌కు దగ్గరై సహజీవనం చేస్తుందన్నారు. హేమంత్‌కు అప్పటికే పెళ్లైంది.. కానీ భార్య దూరంగా ఉంటుందని చెప్పారు. హేమంత్-ప్రియాంక సంబంధం ఇష్టం లేని సతీష్ వారిద్దరిని హెచ్చరించాడన్నారు. అయితే ప్రియాంకను తనకు దూరం చేస్తున్నాడన్న కోపంతో పక్కా ప్లాన్‌తో పార్టీ చేసుకుందామంటూ సతీష్‌ను హేమంత్ తన ఇంటికి పిలిచాడు. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు వాహనాన్ని సైతం హేమంత్ సిద్ధం చేసుకున్నాడు. సతీష్ ఇంటికి రాగానే తలపై రాడ్డుతో బలంగా కొట్టి హత్య చేశాడన్నారు. సతీష్ మృతదేహాన్ని ముక్కలు చేసేందుకు హేమంత్ కట్టర్ కూడా కొనినట్లు తెలిపారు. కానీ ముక్కలు చేయడం వీలుకాక మృతదేహాన్ని ఇంట్లో పెట్టి పారిపోయాడన్నారు. ఇప్పటివరకూ సతీష్ హత్య కేసులో హేమంత్ ఒక్కడే ఉన్నట్టుగా ఆధారాలు లభించాయని వెల్లడించారు. ప్రియాంక మొబైల్‌లో కొన్ని ఛాటింగ్స్ డిలీట్ అయ్యాయని... వాటిని మళ్లీ బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రియంకతో హేమంత్‌కు అక్రమసంబంధం ఏర్పడటంతో హేమంత్ భార్య అతడికి విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది. అనంతరం ప్రియంకతో కలిసి హేమంత్ కేబీహెచ్‌బీ సెవన్త్ ఫేజ్‌లో ఇండిపెండెంట్ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ విషయం సతీష్‌కు కొంతకాలం వరకు తెలియదు. కేబీహెచ్‌బీలో ఉన్న కంపెనీ బ్రాంచ్ నష్టాలు రావడంతో హేమంత్‌ను సతీష్ నిలదీశాడు. నీవు కంపెనీని సరిగా పట్టించుకోవడం లేదు. ప్రియంకతో సాన్నిహిత్యంగా ఉంటున్నావని సతీష్ మందలించాడు. అంతేకాకుండా హేమంత్ జీతం కూడా తగ్గించాడు. దీంతో హేమంత్ సతీష్‌పై ద్వేషం పెంచుకున్నాడు. సతీష్‌ను పార్టీ చేసుకుందామని హేమంత్ నమ్మించి ఇంటికి పిలిచి హత్య చేసినట్లు విచారణలో తేలిందని డీసీపీ వెల్లడించారు.

### శాస్త్ర సాంకేతిక ఫలాలు..

# రైతులకు ఉపయోగపడాలి

### - వ్యవసాయ, ఉద్యానోత్పత్తులు చేరితేనే ప్రయోజనం
### - రైతులు ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు అన్నిచర్యలు చేపట్టాం
### - వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
### - అగ్రిటెక్స్-2019 ప్రదర్శనను ప్రారంభించిన మంత్రి
### - రాష్ట్రంలో యూరియా కొరత లేదు
### - సిద్ధిపేటలో రైతు మరణానికి, యూరియాకి ఎలాంటి సంబంధం లేదన్న మంత్రి

హైదరాబాద్, సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ) : శాస్త్ర సాంకేతిక ఫలాలు రైతులుకు ఉపయోగపడాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మాదాపూర్ హైటెక్స్‌లో అగ్రిటెక్స్-2019 ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ, 24 గంటల విద్యుత్, రాయితీ విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలను బలోపేతం చేశామన్నారు. రైతుబంధు పథకం కింద డబ్బు రాని రైతులకు త్వంలోనే నిధులు ఇస్తామని చెప్పారు. శాస్త్ర సాంకేతిక ఫలాలు రైతులకు ఉపయోగపడాలని, వ్యవసాయ, ఉద్యానోత్పత్తులు రైతులకు చేరితేనే ప్రయోజనం ఉంటుందన్నారు. రైతు తన కాళ్లపై బలంగా నిలబడేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని మంత్రి చెప్పారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక అచ్చుమాయపల్లి ఘటనపై మంత్రి స్పందించారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. రైతు ఎల్లయ్య దురదృష్టవశాత్తు గుండెపోటుతో మృతి చెందారు. ఇది యాదృచ్ఛికంగా జరిగిన దురదృష్టకర ఘటన అని పేర్కొన్నారు. టీఆర్ఎస్ అంటే గిట్టని వారే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు యూరియా కొరత ఎక్కడా లేదన్నారు . రాష్ట్రానికి యూరియా రావడంలో ఒక్కోసారి రెండు రోజులు, ఇంకోసారి 4 రోజులు వివిధ కారణాల వల్ల ఆలస్యమవడం సాధారణమే అన్నారు. వార్తాపత్రికల్లో వస్తున్న వార్తలను చూసి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సిదిపేట జిల్లా దుబ్బాకలో యూరియా కొరత లేదని అన్నారు. అక్కడి ఎమ్మెల్యే రామలింగారెడ్డితో తాను మాట్లాడానని అన్నారు.

# ఏకపక్ష నిర్ణయాలతో చేటు

### కెసిఆర్‌పై మండిపడ్డ చాడ

హైదరాబాద్,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ నిర్ణయాలు ఏకపక్షంగా ఉన్నాయని సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. రెవెన్యూ చట్టాలలో మార్పులపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య చాలా సమస్యలున్నాయని తెలిపారు.

రెవెన్యూ చట్టానికి సంబంధించిన ముసాయిదా ఇంకా రూపొందించలేదన్నారు. రైతుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని ధ్వజమెత్తారు. కొత్త మున్సిపల్ చట్టంలో రాజ్యాంగ సవరణల స్ఫూర్తి దెబ్బతిన్నదని టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు.

రెవెన్యూ చట్టాన్ని ప్రజల మధ్య చర్చ పెట్టాలన్నారు. భూ సమస్యలను భిన్న కోణాల్లో చూడాలని కోదండరామ్ అన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన వల్ల చాలామంది ఆగమైపోయారని వివరించారు. కొత్త రెవెన్యూ చట్టంలో కోనేరు రంగారావు సూచనలు తీసుకోవాలని వెల్లడించారు. పోడు, అసైన్డ్, అటవీ భూములను దృష్టిపెట్టుకొని కొత్త చట్టం తేవాలని విజ్ఞప్తి చేశారు. సెలెక్ట్ కమిటీకి నివేదించి చర్చించిన తర్వాత చట్టం చేయాలన్నారు. లేదంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ చేపడతామని హెచ్చరించారు.

### కరెంట్ షాక్‌తో విద్యార్థికి తీవ్ర గాయాలు

హైదరాబాద్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): నగరంలోని గుడిమల్కాపూర్ నవోదయనగర్‌లో విషాద సంఘటన చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్ తగలడంతో ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన విద్యార్థి హాజీని స్థానికులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న విద్యుత్ అధికారులు విచారణ చేపట్టారు.

# ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో గ్రామీణ ప్రాంతాల్లో మార్పు

**ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నదే కెసిఆర్ ఆలోచన**
**రాష్ట్ర విద్యాశాఖా మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి**

సూర్యాపేట,సెప్టెంబర్ 6 (ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ముప్పయి రోజుల గ్రామ పంచాయితీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో గ్రామీణ ప్రాంతాల్లో గుణాత్మక మార్పు సాధించవచ్చని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కేవలం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు మాత్రమే పరిమితం చేసి చేతులు దులుపు కోకూడదన్నది ముఖ్య మంత్రి కేసీఆర్ తలంపు అని ఆయన చెప్పారు. ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నదే ఆయన ఆలోచన అని ఆయన ప్రేరణతో సమగ్ర గ్రామీణా భివృద్ధి కి ప్రజలు కదం తొక్కలని మంత్రి జగదీష్ రెడ్డి పిలుపుని చ్చారు.ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనున్న 30 రోజుల గ్రామ పంచాయితీ ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంపై సూర్యపేట జిల్లా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సూర్యపేట జిల్లా సూర్యపేట, తుంగతుర్తి, కోదాడలతో పాటు హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అవగాహన సదస్సును ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడారు. అభివృద్ధికి డెడ్ లైన్ లు అవసరవని ....అటువంటి డెడ్ లైన్ లతోటే సకాలంలో మిషన్ భగీరథ పూర్తి చేసుకోగలిగామనన్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు ముందు సంవత్సర కాలంలో పట్టుమని పది కోట్లు ఖర్చు పెట్టిన శాఖే లేదంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదని ఆయన ప్రస్తావించారు. అటువంటిది ఎన్నికలను ఫణంగా పెట్టి డెడ్ లైన్ లతో అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించి 50 వేల కోట్ల రూపాయాలతో మిషన్ భగీరథ పూర్తి చేసిన ఘనత ముమ్మాటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. గ్రామీణాభివృద్ధి కి ముఖ్యమంత్రి కేసీఆర్ రూపొందించిన బృహత్ ప్రణాళికలలో ఇదొకటిని ఆయన కొనియాడారు.పుట్టిన గడ్డకు సేవ చేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అని ....అందు కోసం పదవిని తృణప్రాయంగా త్యజించి స్వరాష్ట్రం లో సుపరిపాలన అంటూ తెలంగాణా రాష్ట్ర ఉద్యామాన్ని మొదలుపెట్టారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ రూపొందించిన 30 రోజుల గ్రామ పంచాయితీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలును కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన తెలంగాణా ఉద్యమ స్ఫూర్తి తరహాలో చేపట్టాలని ఆయన ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ ,జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ దీపికా యుగంధర్ రావు, శాసన సభ్యులు గాధరి కిషోర్ కుమార్ ,బొల్లం మల్లయ్య యాదవ్, ఉల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ గౌడ్,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వెంకట్ నారాయణ గౌడ్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్,జాయింట్ కలెక్టర్ సంజీవ రెడ్డి ,ఆర్ డి ఓ మోహన్ రావు,తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారం నుంచి నందిమేడారం

**మంత్రి కొప్పుల పాదయాత్ర**
**కాళేశ్వరం వద్ద ఘనంగా జలజాతర**
**పాల్గొన్న బాల్క సుమన్ తదితరుల హాజరు**

కాళేశ్వరం,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): అసాధ్యమైన కాళేశ్వరం ప్రాజెక్టును సుసాధ్యం చేసిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నెర్రెలు వాల్చిన బీడుభూములను సస్యశ్యామలం చేసేందుకు ఏకంగా గోదావరి నది దిశనే మార్చి, రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని ఎగువకు తరలిస్తున్నారు. కలలో కూడా ఊహించని ఈ స్వప్నం సాకారమవుతుంటే గోదావరి పరివాహక ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. అందుకే పెద్దపల్లి జిల్లాలోని నంది రిజర్వాయర్ వద్ద జలజాతరను ఘనంగా నిర్వహించారు. 30 వేల మందికిపైగా రైతులు జలజాతరకు హాజరై.. గోదారమ్మకు ఘనంగా కృతజ్ఞతలు పలికారు. నంది రిజర్వాయర్ లో ఉన్న అద్భుత జలదృశ్యాన్ని చూసి మురిసిపోయారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ఈ జలజాతర ఉత్సవం చేపట్టారు. ఇందులో భాగంగా ధర్మారం నుంచి నందిమేడారం వరకు రైతులతో కలిసి మంత్రి కొప్పులు, ఇతర నేతలు పాదయాత్ర చేశారు. తెలంగాణ తల్లికి , అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. జలజాతరకు మహిళలు బోనాలు, బతుకమ్మలతో తరలివచ్చారు. తెలంగాణ ప్రాంత రైతాంగానికి సాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పనిచేస్తున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. రైతాంగ ప్రయోజనాలే ముఖ్యం తప్ప.. బీజేపీ, కాంగ్రెస్ లా రాజకీయాలు చేయడం టీఆర్ఎస్ కు తెలియదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. అటు త్వరలోనే ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించితీరుతామని కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తితో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎద్దేవా చేశారు పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత. మరో 20 సంవత్సరాల వరకు తమకు అధికారం దక్కదనే ఆందోళన కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తుందన్నారు. హైదరాబాద్ లో నిద్రపట్టక.. నియోజకవర్గంలో తిరిగే మొఖం లేక.. తుమ్మడిహట్టి వద్ద బోటు షికార్లు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు అర్థంపర్థంలేనిఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు చుక్కనీరు ఇవ్వకుండా ప్రాజెక్టుల పేరుతో పందికొక్కుల్లా డబ్బులు తిన్నరని విమర్శించారు. మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేసిన సీఎం దేశంలో ఎవరైనా ఉంటే చూపించాలని.. కాంగ్రెస్, బీజేపీ నేతలకు సవాల్ విసిరారు. నిండుకుండలా ఉన్న నంది రిజర్వాయర్ ను చూసి రైతులు పరవశించిపోయారు. ప్రత్యేక పూజలతో కాళేశ్వర గంగకు గులాబీ ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు చెప్పారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అటు జలజాతర సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# నేరేడుచర్ల పురపాలికకు పదికోట్లు

**-సిఎం కెసిఆర్ ఆమోదంతో నిధులు**

సూర్యపేట,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని నేరేడు చర్ల పురపాలక సంఘంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం పది కోట్ల రూపాయల నిధులను విడుదల చేసింది. కొత్తగా నగరపాలక సంస్థగా రూపాం తరం చెందిన నేరేడుచర్ల అభి వృద్ధిలో వెనుకబడిందని అం దుకు అవసరమైన నిధులు కేటాయించాలంటూ నియోజక వర్గ టీఆర్ఎస్ ఇంచార్జ్ శానం పుడి సైదిరెడ్డి మంత్రి జగదీష్ రెడ్డితో కలసి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.అందుకు తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణా పట్టణ మౌళిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ నుంచి రూ. పది కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అట్టి ఉత్తర్వులను సూర్యపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర విద్యాశాఖా మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి చేతుల మీదుగా నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జ్ సైదిరెడ్డి అందుకున్నారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, కోదాడ యంఎల్ ఏ బొల్లం మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సంరద్భంగా సైదిరెడ్డి మాట్లాడుతూ అడగుగానే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంలో సహకరించిన మంత్రి జగదీష్ రెడ్డి కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .

# ఆమ్ఆద్మీ పార్టీకి అల్కాలాంబ గుడ్‌బై...!



**- పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ ట్వీట్**

న్యూఢిల్లీ, సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ) : ఆమాద్మీ పార్టీ అసంతృప్త ఎమ్మెల్యే అల్కాలాంబ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆమ్ఆద్మీ పార్టీతో ఆరేళ్ల తన ప్రయాణం చాలా నేర్పించిందని ఆమె పేర్కొన్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం ట్విటర్ వేదికగా వెల్లడించారు. ఆప్‌కి గుడ్‌బై చెప్పేందుకు, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసేందుకు సమయం ఆసన్నమైందని, గత ఆరేళ్ల నా ప్రయాణం చాలా విషయాలను నేర్పించిందన్నారు. అందరికీ ధన్యవాదాలు.. అని అల్కాలాంబ ట్వీట్ చేశారు. త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలోనే అల్కాలాంబ రాజీనామా తెరమీదికి రావడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ మాజీ సభ్యురాలైన ఆమె.. ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీతో ఫోటో దిగడం చర్చనీయాంశమైంది. ఆమె ఆమాద్మీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరతారంటూ సంకేతాలిచ్చినట్లైంది. అయితే ఆదివారమే తన రాజీనామాపై ట్విటర్లో స్పందించిన అల్కాలాంబ.. వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగనున్నట్టు పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం చాందినీ చౌక్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆమె.. తన నియోజకవర్గంలోని ప్రజలతో 'జన సభ' నిర్వహించిన అనంతరం రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. పార్టీ తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ కొంతకాలం నుంచి బహిరంగంగానే ఆమె విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే.

## మద్రాసు హైకోర్టు సీజేగా అజయ్‌కుమార్ మిట్టల్

చెన్నై, సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ) : ప్రతిష్ఠాత్మకమైన మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అజయ్ కుమార్ మిట్టల్ నియమితులైనట్టు కేంద్రప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ముంబై హైకోర్టు సీనియర్ న్యాయవాదిగా వ్యవహరించిన తాహిల్ రమణి గత ఏడాది మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర ట్రిబ్యునల్ కేసులు, క్రిమినల్ కేసులలో నైపుణ్యం ప్రదర్శించిన ఆమె హైకోర్టులో పలు కీలకమైన తీర్పులు వెలువరించారు. ప్రస్తుతం ఆమెను మేఘాలయ హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగొయ్‌తో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల కమిటీ కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేసింది. అందువల్ల ఆమె త్వరలో ఆ బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో, మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అజయకుమార్ మిట్టల్‌ను మద్రాసు హైకోర్టు సీజేగా నియమిస్తూ కేంద్రప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## గ్రామీణ సంత ప్రారంభం

వరంగల్ రూరల్,సెప్టెంబర్ 6(నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని రాయపర్తిలో గ్రామీణ సంత కార్యక్రమం జరిగింది. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంతను ప్రారంభించారు. ఈ సందరభంగా మంత్రి మాట్లాడుతూ... గ్రామీణ సంత కార్యక్రమాన్ని అమలు చేస్తున్న నాబార్డుకు అభినందనలు. గ్రామీణ సంతలో నాబార్డు అన్ని సౌకర్యాలు కల్పించింది. గ్రామీణ సంత కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని నాబార్డుకు విజ్ఞప్తి చేశారు

## డిసెంబర్ నెలకు ఆర్జిత సేవా టిక్కెట్లు విడుదల

తిరుమల,సెప్టెంబర్6 (ఆంఎన్ఎ): తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. డిసెంబర్ నెలకు సంబంధించి 68,466 టికెట్లు విడుదల చేసినట్లు టీటీడీ ఈవో వెల్లడించారు. ఎలక్ట్రానిక్ లాటరీ విధానం కింద 6,516 సేవా టికెట్లు, సుప్రభాతం 3856, తోమాల 60, అర్చన 60, అష్టదళ పాదపద్మారాధన 240, నిజపాద దర్శనం కోసం 2300 టికెట్లను విడుదల చేశారు. కరెంట్ బుకింగ్ కింద మరో 61,950 ఆర్జిత సేవా టికెట్లు విడుదలయ్యాయి. విశేష పూజకు 2500, కల్యాణోత్సవం 13,775, ఊంజల్ సేవ 4350, ఆర్జిత బ్రహ్మోత్సవం 7975, వసంతోత్సవం 15,950, సహస్ర దీపాలంకరణ కోసం 17400 టికెట్లను టీటీడీ విడుదల చేసింది.

## తలనీలాల ఆదాయం 7.62కోట్లు

తిరుమల,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన తలనీలాల ఈ-వేలం టిటిడి రూ. 7.62 కోట్ల ఆదాయాన్ని గడించింది. ప్రతినెలా మొదటి గురువారం నాడు తలనీలాల ఈ-వేలం జరుగుతున్నది. ఇందులోభాగంగా టిటిడి తిరుమల ప్రత్యేకాధికారి ఎ.వి.ధర్మారెడ్డి పర్యవేక్షణలో తలనీలాల ఈ వేలం జరిగింది. మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, తెల్లవెంట్రుకలు తలనీలాల రకాల ఈ-వేలం నిర్వహించారు. ఈ నెల నిర్వహించిన ఈ-వేలంలో మొత్తం 17,200 కిలోల తలనీలాలు అమ్ముడు పోయాయి. తలనీలాలలో మొదటి రకం, రెండో రకం, మూడో రకం, నాలుగో రకం, ఐదో రకం వాటిని టిటిడి ఈ-వేలంలో పెట్టింది. వీటి ద్వారా ఈ ఆదాయం వచ్చింది.

## ఏపీ వార్తలు

# ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి ఏదీ?

**అనంత కరవుపై తక్షణ చర్యలు తీసుకోవాలి**

అనంతపురం,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని జిల్లా సిపిఐ కార్యదర్శి జగదీశ్వర్ అన్నారు. సీమలో సమస్యలు పరిష్కరించడంలోనూ, అనంత కరువును ఆదుకోవడంలోనూ సర్కార్ విఫలమయ్యిందన్నారు.

జిల్లాలో తీవ్ర కరువుతో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షం లేక ఈ సారి వేసిన పంటలూ ఎండిపోయాయన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలివేసి ప్రజలను మభ్యపెడుతూ రోజుకో కొత్త పల్లవిని ఎత్తుకుంటుందని అన్నారు.

కరువు పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షత కొనసాగుతోందని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, రుణమాఫీ మూడు విడతలు డబ్బులు ఒకే సారి జమ చేయాలని అన్నారు. రైతులు ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. కరువు దృష్ట్యా అనంతపురం జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని దుయ్యబట్టారు. నల్లధనం వెలికితీత, అవినీతి నిర్మూలన, ప్రతి పౌరుడి ఖాతాలో రూ.15 లక్షల జమ, రెండు కోట్ల ఉద్యోగాల కల్పన తదితర అంశాలు ప్రకటనలకే పరిమితమయ్యాయని అన్నారు. ఇలాంటి ప్రకటనలు ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనం చేకూర్చలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# శ్రీకాకుళం జిల్లాలో సీఎం జగన్ విస్తృత పర్యటన



అమరావతి, సెప్టెంబర్ 6 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం పలు సంక్షేమ పథకాలకు శంకుస్థాపన చేశారు.

పలాసలో నిర్మించనున్న 200 పడకల కిడ్నీ సూపర్ స్పెషాలిటీ, రీసెర్చ్ ఆసుపత్రికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం వజ్రపు కొత్తూరు మండలం మంచి నీళ్లపేటలో మత్స్యకారులకోసం జెట్టీ నిర్మాణం, ఉద్దానం ప్రజల కోసం పరిశుభ్రమైన తాగునీటి సరఫరా పథకానికి సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత గడపగడపకూ నాణ్యమైన రేషన్ బియ్యం సరఫరాకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. కాశీబుగ్గలో పైలట్ ప్రాజెక్టుగా బియ్యం సరఫరా పథకాన్ని ప్రారంభిస్తారు. ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురం రాజీవ్ ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో ఆయన ముఖాముఖి మాట్లాడతారు. ఆ తర్వాత సింగుపురంలో అక్షయపాత్ర సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

# ఎపిలో జగన్‌ది తుగ్లక్ పాలన

**-మండిపడ్డ కాంగ్రెస్ నేత తులసిరెడ్డి**

కడప,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో జగన్ 100 రోజుల పాలన అస్తవ్యస్తంగా ఉందని కాంగ్రెస్ నేత తులసిరెడ్డి ధ్వజమెత్తారు. మాట తప్పి మడమ తిప్పిన వ్యక్తి మన ముఖ్యమంత్రి అంటూ విమర్శించారు. జగన్‌ది రివర్స్ పాలన, తుగ్లక్ పాలన అని మండిపడ్డారు. కేసీఆర్‌తో లాలూచీ పడి ఏపీకి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క హామీ కూడా అమలు దిశగా వెళ్లడం లేదని చెప్పారు. పరిపాలన చేతకాని వ్యక్తి.. సీఎం అయితే ఇలానే ఉంటుందని వ్యాఖ్యానించారు. మాటలు కోటలు దాటాయన్నారు. ఏ పనీ కావడం లేదన్నారు. ప్రజలు ఎన్నో ఆశలతో గద్దెనెక్కిస్తే కేవలం మాటలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

# నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

కర్నూలు,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): పిల్లల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని డీఎంహెచ్‌వో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వాటిని పంపించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలకు ఈ మాత్రలు మింగించేలా పాఠశాల ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని అన్నారు. జిల్లాలో 8 లక్షల మంది పిల్లలకు వీటిని పంపిణీ చేయాల్సి ఉందని, పిల్లల్లో రక్తహీనతను అధిగమించేందుకు 6 రకాల క్రిములు ఒక మాత్రతో చనిపోతాయని తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై నులిపురుగల ప్రభావం ఎక్కువగా ఉంటోందని అన్నారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని కలెక్టర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. ఈ మేరకు అధికారులు కార్యాచరణ చేపట్టారు.

# ఏపీలోని ఆక్వారైతులు దేశానికే తలమానిక

**- ఆక్వా రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు**
**- కేంద్ర పశుసంవర్థకశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్**

విజయవాడ, సెప్టెంబర్6(ఆంఎన్ఎ) : దేశ వ్యాప్తంగా ఆక్వా రైతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పశుసంవర్థకశాఖ, పాడిపరిశ్రమాభివృద్ధిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ అన్నారు. గురువారం ఆయన కృష్ణాజిల్లా నందివాడ మండలం జగన్నాథపురం చేపల చెరువును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఆక్వా రైతులతో సమావేశమయ్యారు. అలాగే ఆక్వారైతులు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను కూడా అడిగి తెలుసుకున్నారు. ఏపీలోని ఆక్వా రైతులు దేశానికే తలమానికంగా ఉన్నారని ఆయన ప్రశంసించారు. ఇక్కడి రైతులు అనుసరిస్తున్ననూతల పద్ధతులు కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. చెన్నై నుంచి ఏపీకి సీడ్ తీసుకు రావడం ఇబ్బందిగా ఉందని రైతులు ఆయనకు వివరించారు. దీనికిస్పందించిన కేంద్ర మంత్రి 850కోట్లతో సీడ్‌పైపఖ్‌లైన్ వేయడానికి కేంద్రం సానుకూలంగా ఉందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటాను చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో కంటే రొయ్యలు ఎగుమతులు బాగా పుంజుకున్నాయని ఆయన వెల్లడించారు. దేశం నుంచి 47వేల కోట్ల నాణ్యమైన రొయ్యల ఎగుమతులు జరిగాయని మంత్రి వెల్లడించారు. రొయ్యల దానం ధరలు బాగా పెరిగాయని రైతులు వెల్లడించారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ ధరలను సమీక్షిస్తామని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహన్ని ఇస్తున్నామని అన్నారు.ఈ సందర్భంగా కృష్ణాజిల్లాలో మత్స్య, ఆక్వా పరిశ్రమల అభివృద్ధికిఅనుసరిస్తున్ననూతన టెక్నాలజీ గురించి ఆంధ్ర ప్రదేశ్ అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.

# ఎసిబి వలలో డిప్యూటి తహసిల్దార్

కర్నూలు,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): పాణ్యం డిప్యూటీ తహసీల్దార్ పత్తి శ్రీనివాసులుపై ఎసిబి దాడులు చేసింది. అక్రమాస్తులు కలిగి ఉన్నారనే అభియోగంతో కోర్టు సెర్చ్ వారెంట్‌తో ఎసిబి డిఎస్‌పి నాగభూషణం తన సిబ్బందితో కలసి ఈ దాడులు చేశారు. ఇందులో భాగంగా నంద్యాల, కొండు జూటూరు, కోవెల కుంట్లలో సోదాలు నిర్వహించగా, నంద్యాలలోని అ÷-దదె ఇంట్లో ఒక ఇన్నోవా, రూ. లక్షన్నర నగదు స్వాధీనం చేసుకున్నారు. కోవెల కుంట్లలో భారీగా ఎల్ఐసి బాండ్లు కనుగొన్నారు. పట్టుబడిన సొమ్ము విలువ బహిరంగ మార్కెట్ ప్రకారం కోటిన్నర రూపాయల వరకు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో లాకర్ ఉన్నట్టు ఎసిబి అధికారులు గుర్తించారు.

# అభివృద్ధికి మోకాలడ్డవద్దు

## కాళేశ్వరంపై ఇక విమర్శలు కట్టిపెట్టాలి
### -మండిపడ్డ మంత్రి ఇంద్ర

నిర్మల్,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): కాంగ్రెస్, టిడిపిలు రాజకీయంగా తమ ప్రాబల్యం లేకుండా పోతుందనే భావనతో తెలంగాణ అభివృద్ధి పనులపై కుట్ర చేస్తున్నారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఈ రెండు పార్టీలు ఏ పనిచేసిన వ్యతిరేకించడం అలవాటు చేసుకున్నాయని మంత్రి అన్నారు. కాంగ్రెస్ హయాంలో అవినీతికి పెద్దపీట వేసింది మీరు కాదా అని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం సాకారంకావడంతో వారికి దిక్కుతోచడం లేదన్నారు. తుమ్మడిహట్టి అంటూ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం నాడిక్కడ ఆయన ఇక్కడ మాట్లాడుతూ మిషన్ కాకతీయ ,మిషన్ భగీరథతో కాంగ్రెస్, టిడిపిల ఉనికి గల్లంతు కానుండడంతో వాటికి బెంగపట్టుకుందని, అందుకే పని ఏదైనా అడ్డుకోవడమే లక్ష్యమన్న రీతిలో ఉన్నాయన్నారు. కాళేశ్వరం కోసం మహారాష్ట్ర ఒప్పందాన్ని కూడా కాంగ్రెస్ ,టిడిపిలు వ్యతిరేకించాయన్నారు. దీనిని బట్టి వీరికి అభివృద్ధికన్నా సొంత లాభమే మిన్నగా ఉందన్నారు. ప్రతిపక్షపార్టీలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో, అటు మహారాష్ట్రలో, కేంద్రంలోనూ అధికారంలో ఉన్నా ఇది సాధించలేకపోయారని విమర్శించారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. గోదావరి నదీ జలాలను సద్వినియోగం చేసుకునేందుకు నిర్మించే ఐదు ఆనకట్టల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న సమయంలోనే విమర్శలు చేశారని మంత్రి తెలిపారు. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేసి కాంగ్రెస్ పార్టీ నేతలు అభాసుపాలయ్యారని అన్నారు. పెన్‌గంగ నదీ జలాలను సద్వినియోగం చేసుకోవాలనేది 70 ఏళ్లనుంచి రైతులు కలలు కంటున్నారని వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృఢసంకల్పంతో ఇది సాధ్యమవు తోందని వివరించారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించే ఆనకట్టతో ఆ ప్రాంత రైతులం దరికి ప్రయోజనం చేకూరనుందన్నారు.

ఒప్పందాల వల్ల ప్రాజెక్టులను కట్టుకుంటే పెన్‌గంగ నదిపై చనాక-కొర్టా ఆనకట్ట పూర్తయ్యాక తాంసి, ఆదిలాబాద్, జైనథ్ మండలాలకు 13,500 ఎకరాలకు సాగునీరు అందనుందని వివరించారు. రాజంపేట, పెంప్రాడ్ ఆనకట్టలతో ఈ ప్రాంతంలో మరో 7వేల ఎకరాలకు సాగు నీరు అందునుందని పేర్కొన్నారు.

## కేసీఆర్ నియంతృత్వంలో తెలంగాణ: రామచంద్రరావు

కామారెడ్డి,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): తెలంగాణలో కేసీఆర్ నియంతృత్వ పాలన కొనసాగుతుందని బీజేపీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కామారెడ్డిలో గురువారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..టీఆర్ఎస్ పార్టీలో అంతర్గత వ్యవహారాలు కొనసాగుతున్నాయని, టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఏర్పడబోతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని పార్టీల నుంచి బీజేపీలోకి వలసలు పెరుగనున్నాయని వెల్లడించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలతో పాగా వేయనుందని రామచందర్‌రావు స్పష్టం చేశారు. ఈ సమావేశానికి జాతీయ బొగ్గు గనుల శాఖ స్వతంత్ర డైరక్టర్ మురళీధర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టులో ఉద్యోగాల ఆశతో మోసం

## ఐదుగురు సభ్యుల ముఠా అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగాల ఆశచూపి...మోసాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీసీపీ ప్రకాశ్‌గౌడ్ వివరాల మేరకు నగర శివారు తుక్కుగూడలో ఉండే శ్రీకాకుళం వాసి టి. సంతోశ్‌కుమార్(24), మలక్‌పేట్‌కు చెందిన వి. రాంకుమార్(31), చార్మినార్ వాసి మహ్మద్ అబ్దుల్ ఖాదర్(32), సంతోశ్‌కుమార్ బావమర్ది టి. నారాయణ(29), సరూర్‌నగర్‌కు చెందిన బి. పాండు(39) లు ముఠాగా ఏర్పడ్డారు. ప్రధాన సూత్రధారి సంతోశ్‌కుమార్ 2018లో హిమాయత్‌నగర్‌లో ఏవియేషన్ శిక్షణ పొందాడు. జాబ్‌కు యత్నించి విఫలమయ్యాడు. అయితే తనలా బాధపడేవారిని చేరదీసి... వారికి ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేసేవాడు. తనకు ఉద్యోగం వచ్చిందని కుటుంబాన్ని నిజాంపేట నుంచి తుక్కుగూడకు మార్చాడు. సంతోశ్‌కుమార్‌తో కలిసి ముఠా సభ్యులు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నకిలీ మెయిల్స్ పంపడం, నకిలీ ఐడీ కార్డులు సృష్టించడంతో పాటు అమాయకులైన నిరుద్యోగులను చేరదీసి అందినకాడికి డబ్బులు వసూల్ చేస్తున్నారు. వీరి మోసాలను పసిగట్టిన కొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. అలా.. సుమారు రూ.30 లక్షల మేర వసూలు చేసినట్లు సమాచారం. ఎట్టకేలకు పోలీసులు రంగంలో దిగి ముఠాను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నిమజ్జనానికి రెండ్రోజుల ముందే
# మద్యం దుకాణాలు బంద్

నిర్మల్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): గణెళిష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ శశిధర్ రాజు అన్నారు. నిమజ్జనానికి నెండురోజుల ముందుగానే మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. ఎక్కడా మద్యం సేవించి గొడవలకు దిగవద్దన్నారు. గణెళిష్ నవరాత్రి ఉత్సవ నిర్వహణ, శోభయాత్ర నిర్వహణపై జిల్లా అధికారులు, గణెళిష్ మండపాళ్ల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి వారికి తగు సూచనలు చేశామని అన్నారు.. జిల్లా కేంద్రంలో 11 రోజుల పాటు నిర్వహించే నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. మండపాల వద్ద భక్తి వాతావరణం పెంపొందించేలా నిర్వాహకులు చూసుకోవాలన్నారు.

నిమజ్జన శోభాయాత్ర నిర్వహించే రోజు కచ్చితంగా సమయ పాలన పాటించాలన్నారు. రెండు రోజుల ముందుగానే మద్యం దుకాణాలను మూసి వేయడం జరుగుతుందన్నారు. ప్రతీ గణపతి వాహనానికి జియో ట్యాగింగ్ ఉంటుందని, పోలీసుపరంగా భద్రత పరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదిలావుంటే

తానూర్ మండలంలోని బోసి గ్రామంలో ఉన్న కర్ర వినాయకుని దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఆలయంలో ఉదయం నిర్వహించే మంగళహారతి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రతి రోజూ అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ భక్తులకు కాగితపు కవర్లలో లడ్డూలను విక్రయిస్తున్నారు.

## పోడురైతులకు న్యాయం చేయాలి

ఖమ్మం,సెప్టెంబర్6 (ఆంఎన్ఎ): పోడుదారులపై కేసులు పెట్టి... పంటలు నాశనం చేయడంతో... బంగారు తెలంగాణ వచ్చినట్లా? అని న్యూడెమోక్రసీ నాయకులు ప్రశ్నించారు. పోడుదారులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తుండడం దారుణమన్నారు. వారికి భరోసా ఇచ్చేందుకే వామపక్ష పార్టీల నాయకుల మంతా కలిసి పోరాడుతున్నారని అన్నారు. గ్రామప్రణాళికలో పోడు సమస్యను చేర్చి పరిష్కరించాలన్నారు. పోడు భూముల విషయంలో ప్రభుత్వంతో చావో రేవో తేల్చుకుంటామని స్పష్టం చేశారు. పోడు సాగుదారులపై కేసులు పెట్టి పంటలు ధ్వంసం చేయడం దారుణమన్నారు. పోడుసాగు దారులపై ప్రభుత్వం చేస్తున్న కుట్రను ఎలా ఎదుర్కోవాలో కమ్యూనిస్టులకు తెలుసు అన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం చెప్పేదొకటి ఇక్కడ చేసేది మరోటి అని విమర్శించారు. జైలుకైనా వెళ్తామని, పోడుభూములను మాత్రం వీడే ప్రసక్తే లేదన్నారు. అధికారం రాకముందు ఇచ్చిన వాగ్దానాలను తెరాస ప్రభుత్వం అధి కారం వచ్చాక విస్మరిం చిందన్నారు.

# అడపాదడపా వర్షాలతో చెరువుల్లోకి నీరు

నిజామాబాద్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): జిల్లాలో ఇటీవల పలు మండలాల్లో అత్యధికంగా వర్షం కురిసింది. దీంతో ఆయా మండలలోని గ్రామ చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. అల్పపీడనం ప్రభావంతో రెండు మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో కొన్ని మండలాల్లో మోస్తారు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఈ సీజన్‌లో సాధరణకంటే ఎక్కువగానే వర్షాపాతం నమోదైంది. జూలై, ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరిగాయి. వర్షాకాలం ఇంకా నెలరోజు ఉండడంతో అధిక వర్షాలు కురిస్తే సాధారణకంటే ఎక్కువగానే వర్షాపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వర్ని, మోపాల్, భీంగల్, మోస్రా, ఇందల్వాయి, చందూరు మండలాల్లో 10.0 మి.మీ నుంచి 25.0 మి.మీల వర్షం కురిసింది. నిజామాబాద్ నగరం రెంజల్, వేల్పూర్, భీమ్‌గల్, నిజామాబాద్ రూరల్‌లో భారీ వర్షం కురిసింది. నగరంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా అడపదడపగా భారీ వర్షం కురుస్తోంది. రాత్రి కురిసిన వర్షానికి వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు ఉపశమనం పొందారు. వర్షం ప్రారంభమైన కొద్దిసేపటికి నగరంలోని కొన్ని ప్రాంతంలో విద్యుత్తు అంతరాయం ఏర్పడింది.

# లక్ష్యం దిశగా సర్పంచ్‌లు కృషి చేయాలి

## హరితహారంలో మొక్కల పెంపకం జరగాలి

ఆదిలాబాద్,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): హరిత తెలంగాణ సాధనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 46 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నామని నాటిన ప్రతి మొక్కను రక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని మాజీమంత్రి జోగురామన్న అన్నారు. గ్రామ సర్పంచ్‌లు ఈ బాధ్యతలో ముందుండాలన్నారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు వారు ముందుకురావాలన్నారు. ప్రణాళికలో భాగంగా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పచ్చదనంపై దృష్టి పెట్టామన్నారు. సమైక్యాంధ్ర పాలనలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదని, పేదల కన్నీరు తుడిచి వారిలో ఆనందం నింపడమే తెలంగాణ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని అన్నారు. హరిత తెలంగాణ నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా మొక్కలు నాటాలన్నారు. పర్యా వరణ పరిరక్షణ ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. చెట్లను నరకటం వలన మానవుని మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. ఐదోవి డత హరితహా రంలో కూడా గ్రామాల్లోఅత్యధిక మొక్కలు నాటుతున్నారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటటంతోపాటు వాటిని సంరక్షించాల్సిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక భాధ్యతగా హరితవిప్లవం చేపట్టాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఇంట్లో రెండు మొక్కలను నా టాలని పిలుపుని చ్చారు. ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రజారంజక పా లనను కొనసాగిస్తున్నారని చెప్పారు.

# అభివృద్ధి కేసీఆర్‌కు మాత్రమే సాధ్యం

## కళ్లకు కట్టేలా యాదాద్రికి మహర్దశ : ఎమ్మెల్యే సునీత

యాదాద్రి,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): యాదాద్రి అభివృద్ధికి సంబంధించి మరింత స్పష్టత వచ్చిందని, ఈ ప్రాంతం భవిష్యత్‌లో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లనుందని ఆలేరు ఎమ్మెల్యే, విప గొంగిడి సునీత అన్నారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు యాదాద్రి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల కారణంగా యాదాద్రి దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రం కానుందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏనాడు ఈ క్షేత్ర అభివృద్ధికి పైసా కేటాయించ లేదన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాతనే ఇప్పుడు సిఎం కెసిఆర్ సాహసోపేతే నిర్ణయంతో ఆలయ పుర్నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు కళ్లకు కనపడుతున్నాయని అన్నారు. తాజాగా యాదాద్రిలో జరుగతున్న పనులను చూస్తుంటే ఓ మహాద్భుతం సాకారం కాబోతున్నదని అన్నారు. త్వరలోనే ఆలయం కనువిందు చేయనుందని అన్నారు. యాదాద్రిని అద్భుతమైన పుణ్య క్షేత్రంగా తీర్చిదిద్దుతున్నామని కేసీఆర్ ప్రకటించి అందుకు అనుగుణంగా నిధులు విడుదల చేశారని అన్నారు. రాబోయే కాలంలో భక్తుల రద్దీ భారీగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించాక, ఆమేరకు పనులు సాగుతున్నాయని అన్నారు. యాదాద్రికి అభిముఖంగా గుట్టలతో కూడిన ప్రాంతాన్ని టెంపుల్ సిటీగా తీర్చిదిద్దాలని నిర్ణయినట్లు తెలిపారు. 850 ఎకరాల విస్తీర్ణంలో టెంపుల్ సిటీ నిర్మాణాన్ని చేపడతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. మొదటిదశలో 250 ఎకరాల్లో చేపట్టాల్సిన పనులపై డిజైన్లు ఖరారు చేసి పసనులను పురమాయించారు. టెంపుల్‌సిటీలో కాటేజీలు, ఉద్యానవనాలు, ఫుడ్‌కోర్టులు, పార్కింగ్ స్థలాలు, ఇన్ఫర్మేషన్‌సెంటర్ ఏర్పాటు చేస్తారు. ఇవన్నీకూడా ప్రతిపాదిత యాదాద్రి అభివృద్ధికి అదనంగా చేపట్టే పనులని సునీత అన్నారు. ఈ ప్రాంత వాసులుగా తాము గర్వపడుతున్నామని అన్నారు. యాదాద్రి జిల్లా దీంతో మరింత కొత్తరూపు సంతరించుకోనుందని అన్నారు. ఇదిలావుంటే యాదాద్రి విస్తరణ పనులు చేపట్టాక ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. యాదాద్రిని దర్శించుకోవడంతో పాటు పనులను ప్రత్యక్షంగా చూడాలనుకుంటున్న వారు వస్తున్నారు. గత కొన్నాళ్లుగా ఎటు చూసినా.. క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తులే కనిపించారు. కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు నారసింహుడిని దర్శించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ప్రతిరోజు నిర్వహించే నిత్యకళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరాటంకంగా దర్శనాలు కొనసాగుతున్నాయి.

## రైతులు ఆందోళన చెందవద్దు: ఎమ్మెల్యే

సిద్దిపేట,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): రైతుల శ్రేయస్సే తెలంగాణ సర్కారు లక్ష్యమని ఎమ్మెల్యే రామలింగారెడ్డి అన్నారు. అందుకే సమన్వయ సమితులు ఏర్పాటు చేసి ముందుకు వెళుతోందని అభిప్రాయపడ్డారు. యూరియా కొరతకు అనేక కారణాలు ఉన్నాయని అన్నారు. అయినా రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రైతులు ఆందోళనచెందడం సరికాదన్నారు. అన్నదాతలను అన్ని రకాలుగా ఆదుకోవాలనే దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని వివరించారు. అందుకే రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసి రైతులకు మేలు చేసేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

దేశంలో మొదటిసారిగా రైతులను సంఘటితం చేసేందకు తెలంగాణ రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేసారని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారం కోసం ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్మిస్తుందన్నారు.

# గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు

## అభివృద్ధిని అడ్డుకోవడమే విపక్షాల పని: ఎమ్మెల్యే

మెదక్, సెప్టెంబర్ 6 (ఆర్ఎన్ఎ): ప్రభుత్వం ఏ పనిచేపట్టినా అడ్డుకోవడమే కాంగ్రెస్,టిడిపిలు లక్ష్యంగా పెట్టుకున్నాయని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. ఆనాడు తెలంగాణ ఏర్పాటును అడ్డుకున్న నేతలు ఇవాళ ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని అన్నారు. వీరికి ప్రజల సంక్షేమం కన్నా తమ రాజకీయం ముఖ్యమయ్యిందని మండిపడ్డారు. గ్రామాలు పచ్చగా ఉంటూ అభివృద్ధి సాధించాలన్నలక్ష్యంతో సిఎం కెసిఆర్ ప్రణాళిక రచించారని అన్నారు. ఏ గ్రామానికి ఆ గ్రామం ఇందులో భాగస్వామ్యం అవుతోందన్నారు. సర్పంచ్‌లు తమ సత్తా చాటి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. పదేళ్ల కాలంలో ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన నేతలు ఇవాళ తెలంగాణ అభివృద్ధినే అడ్డుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు అభివృద్ధి అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని ఆరోపించారు. కేసీఆర్‌కు మంచిపేరు వస్తోందన్న అక్కసుతోనే ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నా.. 10ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టుల నిర్మాణాల ఒప్పందం కుదుర్చుకోకుండా తమపై విమర్శలు చేయడం సరికాదన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు పూర్తయితే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మెదక్ జిల్లాకు 10లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మల్లన్నసాగర్ పంట కాల్వల నిర్మాణానికి రైతులు భూములిచ్చి సహకరించాలన్నారు. అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు.

# మజ్లిస్ భయంతోనే విమోచనకు స్వస్తి

## - ప్రజలకు కెసిఆర్ సమాధానం ఇవ్వాలి: బిజెపి

వరంగల్,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): టిఆర్ఎస్ నేతలకు మజ్లిస్ భయం పట్టుకుందని, రజాకర్ల పార్టీ అయిన దానికి లొంగిపోయారని వరంగల్ బిజెపి నేత ధర్మారావు విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో విమోచనపై కెసిఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆత్మగౌరవ పోరాటం అన్న కేసీఆర్ ఇప్పుడు విమోచనదినాన్ని మరవడం సిగ్గుపడాలని అన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినాన్ని ఎందుకు జరపటం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు అడుగడుగునా అడ్డుపడిన మజ్లిస్ మెప్పు కోసం తెలంగాణ ఆత్మ గౌరవాన్ని సీఎం కేసీఆర్ తాకట్టు పెడుతున్నారని అన్నారు. ఇదంతా మజ్లిస్‌ను బుజ్జగించడానకే అన్నారు. దీంతో తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా విమోచన పోరాటాన్ని ప్రస్తావించకపోవడం, దానిని గురించి చెప్పక పోవడం దారుణమన్నారు. సెప్టెంబర్ 17 న జాతీయ పతాకం ఎగురవేయటం సీఎం నైతిక బాధ్యతని గుర్తుచేశారు. చరిత్రను ఓటు బ్యాంక్ రాజకీయాలతో ముడిపెట్టకూడదని, పరిస్థితి మారకుంటే రాబోయే రోజుల్లో కేసీఆర్ చరిత్ర హీనుడుగా మిగులుతారని విమర్శించారు. ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా నిర్వహించక పోవడంచూస్తుంటే కెసిఆర్ వైఖరి గమనించవచ్చని అన్నారు. ఈ అంశాన్ని కనీసం పాఠ్యాంశాల్లో చేర్చక పోవడం దారుణమని, ఉద్యమ సమయంలో సీఎం రోశయ్యను డిమాండ్ చేసిన కేసీఆర్ ..ఇప్పుడెందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజలు ముఖ్యమా..లేక మజ్లీసా తేల్చుకోవాలని హెచ్చరించారు. అధికారికంగా సెప్టెంబర్ 17 విమోచనోత్సవం జరపక పోతే తెరాసకువచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు.

# పొత్తులపై స్పీడ్ పెంచిన పార్టీలు

## -మహారాష్ట్రలో వేగంగా సమీకరణాలు

ముంబై,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): అక్టోబర్ నెలతో మహారాష్ట్ర అసెంబ్లీ గడువు ముగుస్తుంది. గత ఎన్నికల్లో శివసేనతో కలిసి పోటీచేసిన బీజేపీ భారీ విజయం సాధించడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గత ఎన్నికల్లో బీజేపీ 122, శివసేన 63, కాంగ్రెస్ 42, ఎన్సీపీలు 41 స్థానాల్లో విజయం సాధించాయి. ఈసారి కూడా శివసేనతో ఉమ్మడిగా పోటీచేయాలని బీజేపీ నిర్ణయించింది. సీట్ల కేటాయింపులపై ఇరు పార్టీల నేతలు చర్చించారు. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలుండగా, బీజేపీ 160 సీట్లలో పోటీచేయాలని నిర్ణయించింది. శివసేన 110 స్థానాల్లో, 18 స్థానాలను మిత్రపక్షాలకు కేటాంచాలని నిర్ణయించినట్లు బీజేపీ సంకేతాలిచ్చింది. మరింత క్లారిటీ కోసం ఇరు పార్టీలు మరోసారి సమావేశం కానున్నారు. అయితే శివసేన 110 స్థానాలకు ఒకే చెప్పినప్పటికీ ఏయే స్థానాల్లో చేస్తారన్న దానిపై క్లారిటీ ఇవ్వలేదు. బీజేపీ, శివసేనలు మిత్రపక్షాలకు 18 సీట్లను కేటాయించడంపై రిపబ్లిక్ పార్టీ ఇండియా అధినేత, కేంద్రమంత్రి రాందాస్ అథావాలే అసంతృప్తి వ్యక్తంచేశారు. సీట్ల కేటాయింపుపై సీఎం ఫడ్నవీస్, బీజేపీ పార్టీ అధ్యక్షుడితో చర్చలు జరిపమాని ఆయన చెప్పారు. మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపుపై బీజేపీ, శివసేన పునరాలోచన చేయాలని సూచించారు. ఈసారి కూడ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్, ఎన్సీపీలు సీట్ల కేటాయింపులపై మాట్లాడుకున్నాయి. కాకపోతే, ఏయే స్థానాల్లో పోటీచేయాలనే దానిపై క్లారిటీ రాలేదు. తాము కోరినట్లే సీట్ల కేటాయింపు ఉంటుందని ఎన్సీపీ నమ్మకంతో ఉంది. బీజేపీ-శివసేన కూటమికి ఓటమి తప్పదని అశోక్ చౌహాన్ విమర్శించారు. 229 స్థానాల్లో బీజేపీ కూటమి విజయం సాధిస్తుందని తప్పుడు సర్వేలను ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్, ఎన్సీపీ నేతలు ఆరోపిస్తున్నాయి. ఇదిలావుంటే కాంగ్రెస్, ఎన్సీపీల నుంచి కీలక నేతలు బీజేపీలో చేరడంతో సీట్ల కేటాయింపు ఆపార్టీకి తలనొప్పిగా మారింది. బీజేపీ అధిష్ఠానం సిట్టింగ్ లకే మళ్లీ టికెట్లు ఇస్తామని ప్రకటించడంతో పార్టీలో చేరిన నేతల్లో ఆందోళన నెలకొంది.

## ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు

సిద్దిపేట,సెప్టెంబర్6 (ఆంఎన్ఎ): వినాయక నిమజ్జన వేడుకలను సమన్వయంతో కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని అధికారులు అన్నారు. అధికారులు, పోలీసులు, వినాయక మండపాల నిర్వాహకులతో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల నిర్వాహకులు, శాంతికమిటీ సభ్యులు, అధికారులు, పోలీసులు సమన్వయంతో కలిసి నిమజ్జన వేడుకలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. నిమజ్జన వేడుకలకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారన్నారు.

# ఓపెన్ కాస్టులతో బతుకు బుగ్గి చేయొద్దు

## -భూములు కోల్పోయిన గిరిజనులకు న్యాయం చేయాలి

ఆదిలాబాద్,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఓపెన్‌కాస్టులకు స్థానం లేదన్న హామీ మేరకు ఓసీపీల పేరుతో జరుగుతున్న నష్టాన్ని ఆపాలని ప్రభుత్వాన్ని సింగరేణి కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అడ్డగోలుగా ఉపరితల గనులను తవ్వి ప్రజలను నష్టపరచొద్దన్నారు. మనుషులకు నష్టం జరుగకుండా బొగ్గును తవ్వుకోవాలి, భవిష్యత్తులో ఓసీపీలు బందు చేయడం మేలన్నారు. బతుకు దేరువు దెబ్బతీసే ఓసీపీలు కాకుండా మరో మార్గంలో చూడాలని తెలంగాణ సూచించారు. ఇప్పటికే ఓసీపీల ద్వారా నష్టపోయిన వాళ్లకు పరిహారం ఇవ్వాలన్నారు. సింగరేణిలో భూములు కోల్పోయిన వారికి భూములు ఇవ్వాలని, ఇక్కడ వచ్చే ఉద్యోగాలు ఆదివాసులకు ఇవ్వాలన్నారు. సింగరేణి నష్టపోయిన గిరిజనులకు పునరావాసం, భూమిని చూపాలని, బతుకుదెరువు చూపాలన్నారు. కొత్తగా తవ్వే అబ్బాపూర్ ఓసీపీని ఆపాలని, మనుషులకు నష్టం చేయకుండా బొగ్గును తవ్వుకోవాలని, మనుషులను, అడవులను ఆగం చేయవద్దన్నారు.వట్టివాగు ప్రాజెక్టు ఓబీ మట్టితో నిండిపోతున్నాయని, 24,500 ఎకరాలకు పారవల్సిన నీరు కేవలం 5వేలకు మించి సాగు నీరు అందించలేకపోతున్నారన్నారు. హక్కులను సాధించుకోవడానికి సమష్టిగా ముందుగా రావాల్సిన అవసరం ఉందన్నారు. ఓసీపీలకు సంబంధించిన డంప్‌యార్డుల నుంచి మట్టి వస్తుందనే విషయాన్ని గమనించాలన్నారు. సింగరేణితో జరుగుతున్న నష్టాన్ని గమనించాలని మరోవైపు గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఇక్కడో చెట్టు.. అక్కడో చెట్టు పెడితే అడవి పెరుగుతుందా? అని గిరిజనులు అన్నారు.

## క్రీడలు

# క్వార్టర్స్‌లో స్వాట్జ్‌మన్‌పై గెలుపు



న్యూయార్క్ : యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో సీడ్ రఫెల్ నాదల్(స్పెయిన్) మరోసారి జూలువిదిల్చాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో నాదల్ 6-4, 7-5, 6-2 తేడాతో డిగో స్వాట్జ్‌మన్(అర్జెంటీనా)పై విజయం సాధించాడు. ప్రత్యర్థి తొలి రెండు సెట్లలో వరుసగా నాలుగు గేమ్‌లు సాధించి తన ఆధిక్యాన్ని తగ్గించి కంగారు పెట్టినా.. వెంటనే పుంజుకొని వరుససెట్లలోనే గెలుపొందాడు. మ్యాచ్ ప్రారంభం నుంచి బలమైన షాట్లతో విరుచుకుపడిన రఫా.. తొలి సెట్‌లో ఓ దశలో 4-0తో ముందంజలో నిలిచాడు. ఆ సమయంలో అనూహ్యంగా పుంజుకున్న డిగో.. నాదల్ సర్వీస్‌లను బ్రేక్ చేయడంతో పాటు వరుసగా 4 గేమ్‌లు గెలిచి షాకిచ్చాడు. వెంటనే తేరుకున్న స్పెయిన్ బుల్ మరోసారి వరుస పాయింట్లతో తర్వాత రెండు గేమ్‌లను గెలిచి 6-4తో సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో సెట్‌లో మరోసారి నాదల్ 5-1తో నిలువగా ప్రత్యర్థి మరోసారి చెమటలు పట్టించాడు. తొలి సెట్‌లాగా రెండు సార్లు నాదల్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన డిగో 5-5తో ఆధిక్యాన్ని సమం చేసి వణుకు పుట్టించాడు. ఆ తర్వాత ఫోర్ హ్యాండ్ షాట్లతో రెచ్చిపోయిన నాదల్ వరుసగా రెండు గేమ్‌లను గెలిచి.. సెట్ పరాభవాన్ని తప్పించుకున్నాడు. తొలి రెండింటికి విభిన్నంగా మూడో సెట్ సాగింది. మొదటి నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన నాదల్.. 6-2తో అలవోకగానే నెగ్గాడు. సెమీస్‌లో 24వ సీడ్ బ్రెటినితో రఫా తలపడతాడు.

**ముందడుగేసిన బ్రెటిని**

ఉత్కంఠ భరితంగా సాగిన మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో 24వ సీడ్ మెటియో బ్రెటిని(ఇటలీ) 3-6, 6-3, 6-2, 3-6, 7-6(7/5)తో 13వ సీడ్ గేల్ మోనోఫిల్స్(ఫ్రాన్స్)పై గెలిచి సెమీస్ చేరాడు. మ్యాచ్ 3 గంటల 57 నిమిషాలు సాగగా బ్రెటిని 15 ఏస్‌లు సహా 53 విన్నర్లను సాధించాడు. 17 డబుల్ ఫాల్ట్స్ చేసిన మోనోఫిల్స్ మూల్యం చెల్లించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో చివరి సెట్ ఉత్కంఠ మధ్య సాగింది. ప్రతి గేమ్ నువ్వానేనా అన్నట్టు జరగగా.. సెట్ టైబ్రేకర్‌కు చేరింది. చెరో పాయింట్ సాధిస్తూ ఇద్దరు ప్లేయర్లు ముందుకుసాగారు. అయితే చివర్లో తప్పిదాలు చేసిన మోనోఫిల్స్ ఓటమి చెందాడు. పురుషుల సింగిల్స్‌లో సెమీస్ చేరిన ఆటగాళ్లలో నాదల్ మినహా మరే ఇతర ఆటగాడు ఇంత వరకు కనీసం ఏ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు కూడా చేరకపోవడం విశేషం.

**10 నిమిషాల్లో 48వేల టికెట్లు**

జొహాన్నెస్‌బర్గ్ : టోర్నీ ఏదైనా.. వేదిక ఎక్కడైనా టెన్నిస్ దిగ్గజాలు రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్ మధ్య పోరు అంటే అభిమానులకు పండుగే. ఈ పోటీని చూసేందుకు వేయి కండ్లతో ఎదురుచూస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా ఈ ఇరువురు స్టార్లు రోజర్ ఫెదరర్ ఫౌండేషన్‌కు నిధుల సేకరణ కోసం ఓ మ్యాచ్ ఆడనున్నారు. ఈ మ్యాచ్‌కు సంబంధించిన 48 వేల టికెట్లను గురువారం అమ్మకానికి పెట్టగా.. కేవలం 10నిమిషాల్లోనే మొత్తం అయిపోయాయి. ఒక్కో టికెట్ ధర 10 నుంచి 130 డాలర్లుగా నిర్వాహకులు నిర్ణయించారు. 'మ్యాచ్‌కు అద్భుత స్పందన వచ్చింది. మద్దతు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు. 10 నిమిషాల్లోనే టికెట్లన్నీ అమ్ముడైపోయాయి. ఇప్పుడు టికెట్లు దక్కని వారి కోసం వీలైతే అదనపు స్టాండ్లు ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తాం' అని మ్యాచ్ నిర్వాహకుడు, ఫెదరర్ ఫౌండేషన్ సీఈవో జానీనే హాండెల్ ప్రకటించారు. 2010లో బ్రుసెల్స్‌లో సెరెనా-కిమ్ క్లియస్టర్స్ మధ్య జరిగిన ఓ మ్యాచ్‌కు 35,681 మంది హాజరు కాగా.. ఫెదరర్-నాదల్ ఆ రికార్డును బద్దలు కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం నాదల్ ప్రపంచ రెండో ర్యాంకర్‌గా ఉంటే ఫెదరర్ మూడోస్థానంలో ఉన్నాడు.

**సెమీస్‌కు టీనేజర్ ఆండ్రెస్కు**

19 ఏండ్ల అమ్మాయి, 15వ సీడ్ బియంకా ఆండ్రెస్కు(కెనడా) సెమీస్‌కు చేరి.. 2009 తర్వాత యూఎస్ ఓపెన్‌లో ఈ దశకు చేరిన టీనేజర్‌గా రికార్డు సృష్టించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఆండ్రెస్కు 3-6, 6-2, 6-3 తేడాతో 25వ సీడ్ ఇలిసె మెర్‌టెన్స్(బల్గేరియా)పై విజయం సాధించింది. 2 గంటల 2 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో రెండు ఏస్‌లే సంధించిన బియంకా 40 విన్నర్లతో సత్తా చాటింది. ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేసింది. సెమీస్‌లో బెన్‌కిక్‌తో ఆండ్రెస్కు తలపడనుంది.

# 14న రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్



హైదరాబాద్ : తెలంగాణ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 14,15వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ చెస్ చాంపి యన్‌షిప్ తెలంగాణ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనుంది. 14వ తేదీ ఉదయం పది గంటలకు ప్రారంభమవుతాయి. ఈ చాంపియన్‌షిప్ బషీర్‌బాగ్ లోని లాల్‌బహదూర్ ఇండోర్ స్టేడియం సమీపంలలో గల తెలంగాణ చెస్ కార్యాలయంలో నిర్వహించ నున్నారు. ఆసిక్తి గల వారు ఈ నెల 13 లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలి వివరాలకు 7337578899, 7337399299 సంప్రదించాలని తెలంగాణ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌కే.ప్రసాద్ కోరారు.

# ఆమ్లా రికార్డును బ్రేక్ చేసిన మహిళా క్రికెటర్

ఆంటిగ్వా: ఆసీస్ మహిళా క్రికెట్ కెప్టెన్ మెగ్ లానింగ్ మరో రికార్డు సాధించారు. వెస్టిండీస్ మహిళలతో జరిగిన తొలి వన్డేలో మెగ్ లానింగ్ సెంచరీ సాధించి ఆసీస్ భారీ విజయంలో పాలు పంచుకున్నారు. విండీస్‌పై చెలరేగిపోయిన మెగ్ లానింగ్ 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 121 పరుగులు సాధించారు. ఇది మెగ్ లానింగ్‌క 13వ వన్డే సెంచరీ. తద్వారా వన్డే ఫార్మాట్‌లో వేగవంతంగా 13వ సెంచరీ సాధించిన క్రికెటర్‌గా మెగ్ లానింగ్ రికార్డు సృష్టించారు. మెగ్ లానింగ్ 76 ఇన్నింగ్స్‌ల్లోనే 13వ వన్డే సెంచరీ సాధించి కొత్త అధ్యాయాన్ని లిఖించారు. మహిళల క్రికెటే కాకండా పురుషుల క్రికెట్ పరంగా చూసిన ఇదే అత్యుత్తమం.

గతంలో దక్షిణాఫ్రికా క్రికెటర్ హషీమ్ ఆమ్లా 83 ఇన్నింగ్స్‌లో 13వ సెంచరీ మార్కును చేరి ఆ రికార్డును తన పేరిట లిఖించుకోగా, దాన్ని మెగ్ లానింగ్ బ్రేక్ చేశారు. మహిళల టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు కూడా లానింగ్ పేరిటే ఉంది. ఈ జూలైలో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20లో లానింగ్ 133 పరుగులు చేశారు. దాంతో తన పాత రికార్డును తానే బద్ధలు కొట్టుకున్నారు.

విండీస్ మహిళలతో తొలి వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ మహిళలు 50 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 308 పరుగులు చేశారు. మెగ్ లానింగ్ సెంచరీకి తోడు అలైసా హీలే(122) శతకం సాధించడంతో ఆసీస్ భారీ స్కోరు సాధించింది. ఆపై 309 పరుగుల లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన విండీస్ 178 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. 37.3 ఓవర్లలో విండీస్ తొమ్మిది వికెట్ల నష్టానికి 130 పరుగులే చేసింది. చివరి వరసు బ్యాట్స్‌వుమెన్ కైసియా నైట్ ఆబ్సెంట్ హర్ట్‌గా ఫీల్డ్‌లోకి రాలేదు.

# కశ్మీర్ కోసం యుద్ధానికి సిద్ధం

**- ఎట్టిపరిస్థితుల్లోనూ కశ్మీర్ వదిలే ప్రసక్తే లేదు**
**- లోయలో బలవంతంగా హిందుత్వ అమలుకు బీజేపీ యత్నిస్తుంది**
**- కశ్మీర్ ప్రజలకు మేం చెప్పేది ఒకటే..**
**- మేం మీకు తోడుగా ఉన్నాం.. మీకు భరోసా ఇస్తున్నాం..**
**- పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ కమర్ జావేద్ బజ్వా**

ఇస్లామాబాద్, సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ) : కశ్మీర్ కోసం తాము యుద్ధానికి సిద్ధమని, తమ సైనికులు చివరి రక్తపు బొట్టు వరకు పోరాడేందుకు, ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నారని పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ కమర్ జావేద్ బజ్వా అన్నారు. ఈ మేర కు శుక్రవారం పాక్ మీడియాతో మాట్లాడారు. కశ్మీర్ పాక్ ముఖ్య ఎజెండా అని అన్నారు. ప్రస్తుతం భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వేం సవాలుగా భావిస్తున్నామని, కశ్మీర్‌ను వదిలే ప్రసక్తే లేదన్నారు. మా ప్రతి సైనికుడు తన చివరి రక్తపు బొట్టు, చివరి బులెట్, చివరి శ్వాస ఆగే వరకూ కశ్మీర్ కోసం పోరాడు తూనే ఉంటాడని, కశ్మీర్ కోసం ఎలాంటి త్యాగాని కైనా సిద్ధమే అన్నారు. ఈ రోజు కశ్మీర్‌లో హింస, విధ్వంసం పెరి గిపోతు న్నాయని, మోదీ ప్రభుత్వం లోయలో బలవంతంగా హిందుత్వాన్ని అమలు చేయడానికి ప్రయత్ని స్తుందని ఆరోపించారు. కశ్మీర్ ప్రజలకు మేం చెప్పేది ఒకటే.. మేం మీకు తోడుగా ఉన్నామన్నారు. మీకు భరోసా ఇస్తున్నాం.. కశ్మీర్ కోసం యుద్ధానికి కూడా సిద్ధంగానే ఉన్నామని పాక్ ఆర్మీచీఫ్ అన్నారు. జమ్మూకశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు చేసిన నాటి నుంచి నుంచి పాకిస్తాన్ దుందుడుకు చర్యలకు పాల్పడు తూనే ఉంది. ఈ నేపథ్యంలో పాక్ సగటున రోజుకు 10 సార్లు కాల్పుల విరమణ ఉల్లంఘనలకు దిగిందని వెల్లడైంది. పాక్ సైన్యం కవ్వింపు చర్యలతో ఇరు పక్షాల మధ్య కాల్పుల ఘటనలకు దారితీసి ఉద్రిక్తతలు పెరిగాయి. దాంతో పాటు సరిహద్దు వెంబడి ఉగ్రవాదులను భారత్‌లోకి చొచ్చుకువచ్చేందుకు ప్రేరేపిస్తోంది. అయితే పాక్ ఆగడాలను భారత సేనలు దీటుగా తిప్పికొట్టాయి. మరోవైపు గుజరాత్ తీరంలోకి సముద్ర మార్గం ద్వారా పాక్ కవ రాండోలు, ఉగ్రవాదులు ఎంటర య్యేందుకు ప్రయత్నిస్తున్నట్టు భారత నిఘా వర్గాల సమాచారంతో పలు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# సాగర్‌కు కొనసాగుతున్న వరద

నల్లగొండ,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో వస్తుండడంతో అధికారులు జలవిద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 33 549 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. నాగార్జున సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.20 అడుగులకు చేరుకుంది. ప్రాజెకులో 298.0120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఎడమకాల్వ ద్వారా 4881 క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 7878 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, డీటీ గేట్స్ (డైవర్షన్ టన్నల్ ) ద్వారా 10 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా నీటి విడుదల లేదు. రిజర్వాయర్ నుంచి మొత్తం 15219 క్యూసె క్కుల నీరు ఔట్‌ఎ÷-లోగా విడుదలవుతోంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో 877.70 అడుగుల వద్ద 176.7402 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 90890 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

# జిల్లాలవారీగా గ్రామసభలు..హాజరైన ఎమ్మెల్యేలు



హైదరాబాద్, సెప్టెంబర్ 6: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం ప్రారంభమైంది. భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో మంత్రి ఎర్రబెల్లి పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లా ముడుపుగల్ గ్రామంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి..గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలోనీ గ్రామపంచాయతీ ఆవరణలో 30రోజుల కార్యచరణ ప్రణాళిక పై ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే రాజయ్య పాల్గొన్నారు. భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామ సభలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డి పేట మండలం రాగట్ల పల్లెలో 30 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలును జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ పరిశీలించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికారులు, గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ మండలం అంకోలిలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే జోగు రామన్న, అధికారులు హాజరయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామ సభలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, జాయింట్ కె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని మడమడక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రారంభించిన అనంతరం గ్రామ సభలో పాల్గొన్నారు. నారాయణ పేట జిల్లాలోని మక్తల్ నియోజక వర్గం పస్పులలో జరిగిన గ్రామసభ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి హాజరయ్యారు. కోస్గి మండలం గుండుమాల్ గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా నారాయణ పేట మండలం పేరాపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, కలెక్టర్ వెంకట్ రావ్ పాల్గొన్నారు. మెదక్ జిల్లాలో గ్రామ సభలకు ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# యువతి గొంతు కోసిన యువకుడు



మంచిర్యాల,సెప్టెంబర్6(ఆర్ఎన్ఎ): ఓ యువకుడు తన ప్రియురాలి గొంతు కోసి తాను కూడా ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకుంది. రామకృష్ణపూర్ కి చెందిన కమలాకర్ అనే యువకుడు కార్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. కమలాకర్‌కు కాసిపేట మండలం దేవాపూర్ కి చెందిన సల్మా అనే యువతితో పరిచయం ఏర్పడింది. అయితే మూడు నెలల కిందట సల్మాకు వేరే వ్యక్తితో పెళ్లయింది. సల్మా రెండు రోజుల కిందట రామకృష్ణపూర్ లో ఉన్న తన సోదరి ఇంటికొచ్చింది. గురువారం ఈ విషయం తెలుసుకున్న ప్రియుడు కమలాకర్..తనను కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకున్నావని సల్మాతో గొడవ పడ్డాడు. కమలాకర్ కోపంలో మందు బాటిల్ పగులగొట్టి సల్మా గొంతు కోశాడు. అనంతరం తాను కూడా ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్రగాయాలతో ఉన్న ఇద్దరినీ మంచిర్యాల ఆసుపత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు.

# భారత్‌లోకి ఉగ్రవాదులను పంపే కుట్ర

న్యూఢిల్లీ,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): 370 ఆర్టికల్ రద్దు తర్వాత భారీగా ఉగ్రవాదులు భారత్ లోకి చొరబడేందుకు ప్రణాళిక రచిస్తున్నారని ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. . పాకిస్తాన్ ప్రేరేపిత లష్కరే తొయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థల ఉగ్రవాదులు చొరబడే అవకాశమున్నట్లు నిఘావర్గాలు అంచనావేస్తున్నాయి. వి.ఓ కె ద్వారా అవకాశం ఉన్నంత మేరకు ఎక్కువ మంది ముష్కరులను కాశ్మీర్ లోకి పంపేందుకు ఐఎస్ఐ సహకారం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఉగ్ర సంస్థలకు కొత్త వారిని రిక్రూట్ చేసుకునేందుకు ఉగ్ర సంస్థలు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. నిఘా వర్గాల హెచ్చరికతో కశ్మీర్ సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను అప్రమత్తం చేశారు.

# టిక్‌టాక్ వీడియో పిచ్చి

## సొంత జీపును తగులబెట్టుకున్న యువకుడు

జైపూర్,సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ): అహ్మదాబాద్ టిక్‌టాక్ యాప్‌లో పాపులర్ కావడానికి ఓ యువకుడు తన సొంత జీపునే పెట్రోల్ పోసి తగులబెట్టాడు. ఈ సంఘటన సెప్టెంబర్ 2న చోటు చేసుకోగా ఇప్పుడు ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. రాజ్‌కోట్‌లోని కోఠారియా రోడ్డులో ఇంద్రజిత్‌సిన్హా జడేజా(33) తన జీపుపై పెట్రోల్ పోసి తగులబెట్టాడు. అయితే జీపును తగులబెట్టిన దృశ్యాలను అతని స్నేహితుడు నైమెష్ గోహెల్(28) తన సెల్‌ఫోన్లో చిత్రీకరించాడు. ఈ వీడియో పోలీసుల దాకా చేరడంతో సెప్టెంబర్ 3న పోలీసులు జడేజా, గోహెల్‌ను అరెస్టు చేశారు. పోలీసులు వారిద్దరిని విచారించగా జీపు స్టార్ట్ కానందుకే కోపం వచ్చి తగులబెట్టానని జడేజా చెప్పాడు. కానీ పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. టిక్‌టాక్ వీడియో కోసమే జీపుకు నిప్పంటించానని ఒప్పుకున్నాడు జడేజా. ఈ కేసులో ఇద్దరు నిందితులు బెయిల్‌పై విడుదల అయ్యారు.

సినిమా

# మణిరత్నం దర్శకత్వంలో త్రిష?



మణిరత్నం దర్శకత్వంలో చెన్నై చిన్నది త్రిష నటించనుందని కోలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. దర్శకుడు మణిరత్నం ఆ మధ్య సరైన సక్సెస్ లేక కాస్త వెనుకబడ్డారు. అయితే సెక్క సివంద వానం చిత్రంతో మళ్లీ సక్సెస్ రూటు పట్టారు. ఆ ఉత్సాహంతో ఒకసారి వాయిదా వేసిన భారీ చిత్రం పొన్నియన్ సెల్వన్‌ను తిరిగి పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ సినిమా ప్రతిసారి ఏదో ఒక కొత్త అంశం వెలుగులోకి వస్తూ ఆసక్తిని రేకెత్తిస్తూనే ఉంది. ప్రముఖ నవలారచయిత కల్కీ రాసిన నవల పొన్నియన్ సెల్వన్. ఈ నవలను ఇంతకు ముందు ఎంజీఆర్ నుంచి చాలా మంది తెరకెక్కించాలని ఆశ పడ్డారు. అయితే చేయలేకపోయారు. ఇప్పుడు దర్శకుడు మణిరత్నం ఒక యజ్ఞంగా ఈ చిత్రానికి తెర రూపం ఇవ్వడానికి సంకల్పించారు. యువ స్టార్స్ నుంచి సూపర్‌స్టార్స్ వరకు పొన్నియన్ సెల్వన్ చిత్రంలో భాగం కాబోతున్నారు. పలు భాషలకు చెందిన భారీ తారాగణంను మణిరత్నం ఎంపిక చేస్తున్నారు. ఇప్పటికే వందియదేవన్‌గా నటుడు కార్తీ, అరుళ్‌మోళివర్మగా జయంరవి, పూంగళలిగా నయనతార, సుందరచోళన్‌గా బిగ్‌బీ అమితాబ్‌బచ్చన్, ఆదిత్త కరికాలన్‌గా విక్రమ్, కందవై పాత్రలో నటి కీర్తీసురేశ్, నందిని పాత్రలో అందాలరాశి ఐశ్వర్యరాయ్, పళవై÷-టట్టైరాయర్ పాత్రలో సత్యరాజ్‌లను ఎంపిక చేసినట్లు సమాచారం. మలయాళ నటుడు జయరాం, నటి అమలాపాల్, ఐశ్వర్యలక్ష్మి కూడా ముఖ్య పాత్రల్లో నటించనున్నట్లు తెలిసింది. తన పొన్నియన్ సెల్వన్ చిత్రంలో నటించనున్న విషయాన్ని నటుడు జయరాం ఒక ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇక మణిరత్నం దర్శకత్వంలో పొన్నియన్‌సెల్వన్ చిత్రంలో నటించనుండడం తన అదృష్టం అని నటి ఐశ్వర్యరాయ్ ఇప్పటికే పేర్కొన్నారు. మణిరత్నం ఎప్పుడు కాల్‌షీట్స్ అడిగినా కేటాయిస్తానని చెప్పారు. తాజాగా సంచలన నటి త్రిష కూడా పొన్నియన్ సెల్వన్ చిత్రంలో నటించనున్నట్లు తాజా సమాచారం. ఆమెను నటింపజేసే విషయమై చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ చిత్రంలో నటించనున్న తారాగణాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. పొన్నియన్ సెల్వన్ చిత్రాన్ని మణిరత్నం రూ.800 కోట్ల భారీ వ్యయంతో రెండు భాగాలుగా తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ సంస్థలో కలిసి నిర్మించనున్నట్లు సమాచారం.

# మరో మూవీకి రజనీకాంత్ గ్రీన్ సిగ్నల్!



నటుడు రజనీకాంత్ రాజకీయా రంగప్రవేశం సంగతి ఏమోగానీ, ఆయన సినిమాలను మాత్రం వరుసగా చేసుకుంటూ పోతున్నారు. ఇంకా చెప్పాలంటే ఇంతకు ముందుకంటే రజనీకాంత్ తన చిత్రాల వేగాన్ని పెంచారని చెప్పవచ్చు. ఇంతకు ముందు సినిమాల మధ్య గ్యాప్ తీసుకునేవారు. ఇటీవల కబాలి, కాలా, పేట, దర్బార్ అంటూ వరుసగా చిత్రాలు చేసుకుంటూపోతున్నారు. ప్రస్తుతం దర్బార్ చిత్రంలో నటిస్తున్నారు. నయనతార నాయకిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఏఆర్.మురుగదాస్ తెరకెక్కిస్తున్నారు. చిత్ర షూటింగ్ చివరి దశకు చేరుకుంది. వచ్చే సంక్రాంతికి తెరపైకి తీసుకురావడానికి చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నారు. ఇక నెక్స్టేంటీ? అన్న ప్రశ్నకు సమాధానం రెడీ అయిపోయ్యింది. రజనీకాంత్‌ను శివ డైరెక్ట్ చేయనున్నారు. ఈ దర్శకుడు వరుస హిట్లతో జోరు మీదున్నారు. వీరం, వేదాళం, వివేకం, విశ్వాసం వంటి విజయవంతమైన చిత్రాలను చేసిన శివ తాజాగా రజనీకాంత్ కోసం సూపర్ కథను సిద్ధం చేశారు. అది రజనీకాంత్‌కు నచ్చడంతో తెరకెక్కనుంది. అయితే నటుడు సూర్య హీరోగానూ శివ ఒక చిత్రం చేయనున్నారు. ఈ చిత్రం పూర్తి అయిన తరువాత రజనీకాంత్ నటించే చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు తాజా సమాచారం. ఈ చిత్రానికి డీ.ఇమాన్ సంగీతాన్ని అందించనున్నారన్నది తాజా సమాచారం. 100 చిత్రాలకు పైగా చేసిన డీ.ఇమాన్ ఇప్పటి వరకరూ రజనీకాంత్ చిత్రానికి పనిచేయలేదన్నది గమనార్హం. తాజా ఆ అవకాశాన్ని దర్శకుడు శివ కల్పించినట్లు తెలిసింది. అజిత్ హీరోగా శివ దర్శకత్వం వహించన విశ్వాసం చిత్రానికి డీ.ఇమాన్ అందించిన సంగీతం బాగా ప్లస్ అయ్యిందనే టాక్ వచ్చింది. దీంతో దర్శకుడు శివ తాను రజనీకాంత్ హీరోగా రూపొందించనున్న చిత్రానికి డీ.ఇమాన్‌నే సంగీత దర్శకుడిగా ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే ఈ చిత్రానికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కాగా శివతో చేసే చిత్రం తరువాత రజనీకాంత్ కేఎస్.రవికుమార్ దర్శకత్వంలోనూ నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

# విజయ్ ఆంటోనితో అల్లు శిరీష్

'కొలైక్కారన్' కమర్షియల్ హిట్ తరువాత విజయ్ ఆంటోని నటించనున్న కొత్త చిత్రంలో టాలీవుడ్ యువ హీరో అల్లు శిరీష్ నటించనున్నాడు. విజయ్ మిల్టన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ పతాకంపై కమల్ బోరా, లలితా ధనుంజయన్, ప్రదీప్‌కుమార్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'గౌరవం' చిత్రం ద్వారా రాధామోహన్ దర్శకత్వంలో అల్లు శిరీష్ గతంలో కోలీవుడ్‌కు పరిచయమయ్యాడు. నటుడిగా మంచి గుర్తింపు పొందినా అవకాశాలు అంతగా రాకపోవడంతో టాలీవుడ్‌కే పరిమితమయ్యాడు. చాలా గ్యాప్ తరువాత అల్లు శిరీష్ తమిళంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తున్న ఈ చిత్రంలో శిరీష్ అతి కీలకపాత్రలో నటించనున్నాడు.

ఇంకా పేరు పెట్టని ఈ చిత్ర షూటింగ్ నవంబర్ నెలలో ప్రారంభం కానుంది. ఈ చిత్రం గురించి నిర్మాతల్లో ఒకరైన కమల్ బోరా మాట్లాడుతూ తమ కాంబినేషన్‌లో రూపుదిద్దుకోనున్న మొదటి చిత్రమిదని, విజయ్ మిల్టన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో విజయ్ ఆంటోనితో కలిసి అల్లు శిరీష్ నటించడం వల్ల తమ చిత్రానికి మరింత బలం చేకురుతుందని, విజయ్ ఆంటోని పాత్ర గత చిత్రాల కంటే వైవిధ్యంగా ఉంటుందని తెలిపారు. మరోసారి తమిళంలో నటించడం చాలా సంతోషంగా ఉందని, ఈ చిత్రంలో రిచ్ లుక్‌తో పాటు ఇన్నోసెంట్ కామెడి పండించే పాత్రలో నటించనున్నానని అల్లు శిరీష్ పెర్కొన్నారు.

# మరో రీమేక్‌లో అజిత్ ?

తమిళంలో అజిత్ మంచి క్రేజ్ ఉన్న మాస్ హీరో. అలాంటి హీరో మాస్ ఎలిమెంట్స్ లేని 'పింక్' చిత్రం రీమేక్‌లో నటించి, అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఈ సినిమా 'నేర్కొండ పార్వై'గా తమిళంలో రీమేకై మంచి విజయం సాధించింది.

బోనీ కపూర్ నిర్మించారు. ప్రస్తుతం అజిత్ చేస్తున్న 60వ చిత్రాన్ని కూడా బోనీయే నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే అజిత్ మళ్లీ ఓ హిందీ చిత్రాన్ని రీమేక్ చేసే ఎ÷-లాన్‌లో ఉన్నారని తెలిసింది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా అనుభవ్ సిన్హా రూపొందించిన చిత్రం'ఆర్టికల్ 15'. ఈ చిత్రం తమిళ రీమేక్‌లో అజిత్ నటిస్తారని వార్తలు వస్తున్నాయి. విశేషం ఏంటంటే.. అజిత్ 59వ సినిమాను నిర్మించి, 60వ చిత్రాన్ని కూడా పట్టాలెక్కించిన బోనీ కపూరే ఈ 'ఆర్టికల్ 15' తమిళ రైట్స్ కూడా కొనుగోలు చేశారట. అంటే.. అజిత్‌తో మూడు సినిమాల డీల్‌ని బోనీ కుదుర్చుకుని ఉంటారనుకోవచ్చు.

## సుస్వర తరంగ్‌కే 11వ ఎడిషన్ రేడియో సిటీ సూపర్‌సింగర్ కిరీటం




హైదరాబాద్, సెప్టెంబర్ 6: భారతదేశంలోని అగ్రశ్రేణి రేడియో నెట్‌వర్క్ 'రేడియో సిటీ' తుది దశకు చేరుకున్నది. ఈ ఏడాది రేడియో సిటీ సూపర్ సింగర్ విజేతగా సుస్వర తరంగ్ నిలిచారు. భారతదేశంలోనే ప్రతిభావంతులైన నేపథ్య గాయకుల అన్వేషణకు ప్రారంభించిన '11వ సుజుకి గిక్సర్ రేడియో సిటీ సూపర్ సింగర్' గ్రాండ్ ఫైనల్స్ ముగిసింది. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలోని శరత్ సిటీలో సినీ, వాణిజ్య సంస్థలకు చెందిన ప్రముఖుల తళుకుబెళుకుల మధ్య గ్రాండ్ ఫినాలే సాగింది.

11వ ఎడిషన్ గిక్సర్ రేడియో సిటీ సూపర్ సిటీ సింగర్ పోటీ నాలుగు వారాలుగా ఉత్తమ స్వరం గల గాయకుల కోసం జరిగిన పోటీలో ప్రతిస్పందన లభించింది. ఉత్తమ గాయకుడి కోసం ఆరుగురు గాయకులు గ్రాండ్ ఫినాలే కోసం పోటీ పడ్డారు. ప్రత్యూష పల్లపోతుల, నిఖితారావు, మౌన్య అర్మల్లా, శ్రావణ్ గొడుగు, సుస్వర తరంగ్, శ్రీవాత్సవ అమరావది, పోటీలో ఉన్నారు. పేరొందిన టాలీవుడ్ సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ రేడియో సిటీ సూపర్ సింగర్ విజేత సుస్వర తరంగ్‌కు అవార్డు ప్రదానం చేశారు. రూ.50 వేల నగదు బహుమతిని అందజేశారు. అవార్డుల ప్రదానోత్సవంలో బాహుబలి ఫేమ్ అడవి శేష్ తదితరులు పాల్గొన్నారు. జూనియర్ గాయకులు మనస్సులను కదిలించే ఈ ప్రదర్శనతో అటు శ్రోతలను, ఇటు న్యాయ నిర్ణేతలను మైమరిపింపజేసింది.

వరుసగా 11 వసంతాలుగా విజయవంతంగా సాగుతున్న రేడియో సిటీ సూపర్ సింగర్ పోటీ ప్రజాదరణతో విజయవంతమైంది. ఈ పోటీల్లో పాల్గొనడంతో చలన చిత్ర పరిశ్రమకు పరిచయమైన వారిలో హర్జోత్ కౌర్, మన్యా నారంగ్, శ్రీ గణే? తదితర ఉత్తమ గాయకులు ఉన్నారు. దేశ వ్యాప్తంగా 6.9 కోట్ల మందికి పైగా శ్రోతల ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన గాయకుల కోసం అన్వేషణ సాగింది. రేడియో సిటీ స్టూడియోస్, నగరాల్లోని మాల్స్, ఐవీఆర్ఎస్, సోషల్ మీడియా వేదికలు, రేడియో సిటీ బ్రాండ్ వాహనాల ఆధ్వర్యంలో శ్రోతల నుంచి నామినేషన్లను ఆహ్వానించడం జరిగింది. రేడియో సిటీ చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ కార్తిక్ కల్లా ఈ సందర్భంగా మాట్లాడుతూ '11వ ఎడిషన్ రేడియో సిటీ సూపర్ సింగర్ పోటీ విజయవంతంగా పూర్తి కావడం సంతోషంగా ఉంది. ప్రతిభావంతులైన గాయకులకు వేదిక హైదరాబాద్ నగరం. అవకాశాల కోసం ఎదురు చూస్తున్న వారంతా తమ ప్రతిభా పాటవాలను రుజువు చేసుకునే వేదిక రేడియో సిటీ సూపర్ సింగర్స్ పోటీ. గత 11 ఏళ్లుగా భారతదేశంలోని ప్రతి గాయకుడికి తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు వేదిక కల్పించింది. వారి కలలు, ఆకాంక్షలు నిజమయ్యేలా చేసింది. ఈ ఏడాది ఫైనల్స్‌కు చేరుకున్న వారికి, విజేతలకు అభినందనలు తెలుపుతున్నా. వారి కలలు సాకారం చేసుకున్నందుకు అభినందిస్తున్నా. ఏడాదికేడాది రేడియో సిటీ సూపర్ సింగర్ పోటీ గాయకులు అత్యున్నత కీర్తి ప్రతిష్ఠలు పొందేందుకు తన ప్రయాణాన్ని కొనసాగిస్తుంది' అని చెప్పారు. ఇటీవలే విడుదలైన బ్లాక్ బస్టర్ థ్రిల్లర్ 'ఎవరు' విజయవంతంగా మూడోవారాన్ని పూర్తి చేసుకుంటున్న సంబురాన్ని అడవిశేష్ సొంతం చేసుకుంటున్నారు. ఇందులో నటించిన రెజీనా చాన్సంద్రా ఈ సందర్భంగా మాట్లాడుతూ '11వ సీజన్ రేడియోసిటీ సూపర్ సింగర్' గ్రాండ్ ఫినాలేలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నాను. కఠినమైన పోటీలో మధురమైన గాయాలతో పోటీ పడిన అభ్యర్థులందరికీ దీవెనలు, ఆశీస్సులు అందజేస్తున్నా. ఈ పోటీలో విజేత, పోటీ పడిన అభ్యర్థులందరికి ఉజ్వల భవిష్యత్ రావాలని కోరుకుంటున్నా' అని చెప్పారు.

## జైల్‌లో సాధారణ జీవితం గడిపిన చిదంబరం

**– టీ, ఓట్స్ మాత్రమే అల్పాహారం**

న్యూఢిల్లీ, సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ) : ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టయిన కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరాన్ని తీహార్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. అయితే ఆయన మొదటిరోజు సాధారణ ఖైదీలాగే జీవితాన్ని గడిపినట్లు జైలు అధికారులు తెలిపారు. రాత్రి అందరితోపాటు సాధారణ ఆహారం తీసుకుని, తనతో తెచ్చుకున్న మందులను వేసుకున్నట్లు వెల్లడించారు. ఢిల్లీలోని సీబీఐ కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో ఆయనను తీహార్ జైలుకు గురువారం సాయంత్రం తరలించారు. గురువారం రాత్రి చిదంబరం రొట్టె, మెంతి కూరతో చేసిన పప్పు, కూరగాయాలతో డిన్నర్ చేసినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం మాత్రం ఆయన కేవలం టీ, ఓట్స్‌ను అల్పాహారంగా తీసుకున్నారట. శుక్రవారం ఉదయం ఆయన కాసేపు వాకింగ్ చేశారని సమాచారం. మిగతా ఖైదీలకు వడ్డించిన భోజనాన్నే చిదంబరానికి కూడా వడ్డిస్తున్నట్లు జైలు అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే చిదంబరానికి తీహార్ జైలులోని 7వ నంబర్ సెల్‌ను కేటాయించారు. ఈడీ కేసుల్లో అరెస్టయిన వారిని ఇక్కడ ఉంచుతారు. గతంలో ఇదే కేసులో కార్తీ అరెస్టయినప్పుడు 7వ సెల్‌లోనే 12 రోజులు గడిపారు. కోర్టు ఆదేశాల మేరకు చిదంబరానికి ప్రత్యేకంగా ఒక గది, వెస్టర్న్ టాయిలెట్ కేటాయించామని, అంతకుమించి ఎలాంటి సదుపాయాలు లేవని అధికారులు తెలిపారు.

# మొక్కలు నాటకపోతే ఉద్యోగాలు ఊడతాయ్!

**– రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలి**

**– మీ ఊరి భవిష్యత్ మీచేతుల్లోనే**

**– పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

**– గట్లనర్సింగాపూర్‌లో 30రోజుల ప్రత్యేక ప్రణాళికను ప్రారంభించిన మంత్రి**

వరంగల్, సెప్టెంబర్6(నేటనిజం ప్రతినిధి): గ్రామాల్లో మొక్కలు నాటకపోతే అధికారుల ఉద్యోగాలు ఊడతాయంటూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గ్రామాల సమగ్ర వికాసమే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం సంకల్పించిన 30 రోజుల ప్రత్యేక ప్రణాళికలను శుక్రవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మీ ఊరి భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని, చెత్త చెదారం లేకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మీ బాధ్యత అని ఎర్రబెల్లి హితవుపలికారు. గ్రామాభివృద్ధికి దాతల సాయం కచ్చితంగా ఉండాలన్నారు. గట్లనర్సింగాపూర్ గ్రామాభివృద్ధి కోసం భాస్కర్‌రావు అనే దాత రూ.2 కోట్ల విరాళం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. దేశానికి పట్టుకొమ్మల్లాంటి గ్రామాల్లో అన్ని వసతులు కల్పిస్తామని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రణాళిక అమలు కోసం అందరూ టీమ్ వర్క్‌గా పనిచేయాల్సిన అవసరం ఉంది.. ఈ ప్రణాళికలను నూరు శాతం అమలు చేసిన ఉత్తమ గ్రామపంచాయతీలను దత్తత తీసుకుంటా' అని మంత్రి పేర్కొన్నారు. పల్లెలో గుణాత్మక మార్పు తీసుకువచ్చే బృహత్తరమైన, అరుదైన అవకాశం ప్రస్తుత సర్పంచ్‌లకు దక్కిందని మంత్రి దయాకర్‌రావు అన్నారు. విస్మృత స్థాయిలో ప్రజాప్రతినిధులు, ప్రజలందరినీ భాగస్వాములు చేసి ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగితే గ్రామాల అభివృద్ధి సులభతరం అవుతుందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరి సహకారం తీసుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, నీరందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నూతన చట్టాలు చేశామని చెప్పిన మంత్రి.. అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల కొరత లేదని వెల్లడించారు.

సర్పంచ్‌లకు అనేక అధికారాలు కల్పించామని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ పల్లెలను మెరిసేలా చేయాలని అన్నారు. హరితహారం ద్వారా పంచాయతీల వారీగా ఎన్ని మొక్కలు నాటాలో గ్రామసభ ద్వారా తీర్మానం చేసి ఆ లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రముఖుల నుంచి విరాళాలు సేకరించి పనులు చేపట్టాలని.. అలాంటి వారి ఫొటోలను గ్రామపంచాయతీలలో పెట్టాలని సూచించారు. గ్రామాల్లో చెత్తాచెదారం తొలగింపునకు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకునే వెసలుబాటు కల్పించామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను సర్పంచ్‌ల ఆజమాయిషీలోకి పరిధిలోకి తీసుకురానుండగా.. ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను సర్పంచ్‌లకు అప్పగించినట్లు మంత్రి వివరించారు.

# మీ చేతగాని తనాన్ని మాపై నెట్టకండి

**– టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత**

**– కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్6 (ఆర్ఎన్ఎ) : టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహించటమే కాకుండా, వారి నిర్లక్ష్యం, చేతగాని తనాన్ని తమపై రుద్దాలని చూడటం సరికాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యూరియా అంశంపై కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేనందువల్లే యూరియా సమస్య తలెత్తిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన వెంటనే కేంద్రం 50శాతం యూరియాను తెలంగాణకు పంపిందని చెప్పారు. మరో 50శాతం యూరియా రెండు రోజుల్లో చేరుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక ఉంటే ఈ సమస్య ఉత్పన్నమై ఉండేది కాదని అన్నారు. రాష్ట్రం అడిగిన వెంటనే కేంద్రం యూరియాను పంపుతోందని చెప్పారు. రైతులు ఎవరూ యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని చెప్పుకుంటున్నారే తప్ప, వారి ఇబ్బందులను తొలగించడంలో ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో మొన్నటి వరకు వర్షాలు లేక రైతులు పంటలు సాగు చేసుకోలేక పోయారని, ఇప్పుడు వర్షాలు వచ్చి రైతుల పంటలు సాగు చేసుకున్నారని, వారికి వేసే సమయంలో యూరియా కొరత రైతులకు పెద్ద దెబ్బ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ముందుస్తు ప్రణాళికతో కాకుండా తమకు తోచినట్లు ఏకపక్ష నిర్ణయాలతో ముందుకెళుందని, దీంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com